సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 18-4-2025 15/-






# వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం?






గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



సంపుటి: 47 సంచిక: 16 హైదరాబాద్
శుక్రవారం 18 ఏప్రిల్ 2025 రూ.15-00
19 షవ్వాల్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

తమకంటే పెద్దవారిని గౌరవించనివాడు, తమకంటె చిన్నల పట్ల మెతక వైఖరి అవలంబించని వాడు మాలోని వాడు కాదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | |
|---|---|
| ఇదేనా సబ్ కా సాత్ ...... | 04 |
| వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం? ...... | 05 |
| ఇస్లామ్ సందేశం– మౌలిక అంశాలు ...... | 12 |
| భూమి భారం పెరుగుతోందా? ...... | 15 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| ఈజిప్ట్ పరిస్థితులు, టర్కీ అనుభవాలు – గుణపాఠాలు – 3 ...... | 20 |
| నల్లజాతి సూరీడు హజ్రత్ బిలాల్ (రజిఅన్) ...... | 22 |
| నవ్వు... నలభై విధాల గ్రేటు ఆరోగ్యానికి రూటు ...... | 24 |
| ఏకాంతం, ప్రశాంతం = సుఖాంతం ...... | 26 |
| వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తాం... ...... | 29 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| పండగ వచ్చింది కాని సంతోషం లేదు ...... | 34 |


**ఇక పోరుబాటే...**



వక్ఫ్ ఆస్తుల రక్షణకై
దేశ వ్యాప్త ఉద్యమం
మోడీ మెడ వంచేదాక
ఆగదు మహోద్యమం!
ప్రజాస్వామ్య పరిధిలో
పట్టండోయ్ పోరుబాట
రాజ్యాంగ భక్షకులకు
వలువండి పట్టి తాట!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## ఇదేనా సబ్ కా సాత్ ?

**అమెరికా అధ్యక్షుడు** టారిఫ్ వడ్డించాడు. షేర్ మార్కెట్ కుప్ప కూలింది. మదుపరులు లక్ష కోట్లు నష్టపోయారన్న వార్తలు వచ్చాయి. నిరుద్యోగ సమస్య యువతను పీడిస్తోంది. మరోవైపు అధిక ధరలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి. కానీ దేశంలో ఈ సమస్య లపై చర్చలు జరగడంలేదు. టీవీల్లో ఈ సమస్యలు కనబడడం లేదు.

ఎలాంటి వార్తలు వస్తున్నాయంటే భక్తితో జరుపుకోవలసిన శ్రీరామనవమి రోజున ప్రయాగరాజ్‌లో ఒక దర్గా వద్ద రెచ్చ గొట్టే నినాదాలు చేస్తూ, అసభ్యకరమైన తిట్లు తిడుతూ వీరంగం వేసిన గుంపు కాషాయ జెండాలు ఎగరేస్తూ, దర్గా పైకి ఎక్కి కాషాయజెండా ఎగరేసిందనే వార్త వచ్చింది.

దేశంలో ఒకప్పుడు శ్రీరామనవమి ఎలా జరిగేది? ఇప్పుడు వాతావరణం ఏమయ్యింది?

బిహారులో మోకామా రైల్వే స్టేషనులో 32 మంది ముస్లిం పసిపిల్లలను, వారి సంరక్షకులను 14 గంటల పాటు రైల్వే పోలీసులు నిర్బంధించారు. ఎందుకంటే వారందరినీ దుస్తు లతో పోల్చుకున్నారు, ముస్లిములుగా కనిపిస్తున్నారు కాబట్టి వారిని బాలకార్మికులనే సాకుతో నిర్బంధించారు. ఆ పిల్లలు సూరత్‌లోని జామియా జకరియా మదరసాలో చదువు కుంటున్న పిల్లలు. వారి ఐడి కార్డులు చూపించినా పోలీసులు లక్ష్యపెట్టలేదు. స్థానికులు కల్పించుకుని మాట్లాడితే వారిని కూడా నిర్బంధిస్తామని బెదిరించారు. ఎందుకంటే దుస్తులను చూసి గుర్తుపట్టారు కదా. చివరకు ప్రజల్లో నిరసన పెరగ డంతో 14 గంటల తర్వాత విడిచిపెట్టారు.

ఇది కేవలం ముస్లిములకే పరిమితం అవుతుందనుకుంటే పొరబాటు. ఢిల్లీలో చేపలు తింటున్నారని బెంగాలీలపై మత తత్వ గుంపులు దాడులకు పాల్పడ్డాయని తృణమూల్ నేత మహువా మొయిత్రా తీవ్రంగా విమర్శించిన వార్త వచ్చింది. అంతెందుకు, ఒక అమ్మాయి శ్రీ రామనవమినాడు ఉపవాసం ఉండి, లక్నో కబాబ్ అనే రెస్టారెంటు నుంచి వెజిటేరియన్ బిరియానీ ఆర్డరు ఇచ్చిందంట. లక్నో కబాబ్ అనే పేరున్న రెస్టారెంటు నుంచి ఎందుకు, ఎలా వెజిటేరి యన్ బిరియానీ ఆర్డరు ఇచ్చిందో ఆమెకే తెలియాలి. కాని నాన్‌వెజ్ బిరియానీ వచ్చింది. ఆమె ఏడుస్తూ ఒక పోస్టుపెట్టింది. వెంటనే పోలీ సులు ఆ రెస్టారెంట్ యజమా నిని అరెస్టు చేశారు. ఆ యజమాని పేరు ముస్లిం కాదు, హిందువు. ఈజ్ ఆఫ్ బిజినెస్ దేశంలో ఉందా?

శ్రీరామనవమి ఊరేగింపు ముంబయిలో ఎలా జరిగింది. అసభ్య అశ్లీల నినాదాలు, తిట్లు, అశ్లీల పాటలు, విద్వేష నినాదాలతో ఈ ఊరేగింపు సాగిందన్న వార్తలు వచ్చాయి.

వక్ఫ్ చట్టం తర్వాత ఇప్పుడు యూనిఫాం సివిల్ కోడ్ తెచ్చేస్తామని ఉత్తరప్రదేశ్ బీజేపీ నాయకుడు ప్రకటించేశాడు. ఉత్తరప్రదేశ్‌లో వక్ఫ్ భూములెన్ని ఉన్నాయో లెక్కలు తీస్తున్నా రన్న వార్తలూ వస్తున్నాయి. మహారాష్ట్రలో బీజేపీ మిత్రపక్షం నాయకుడు నిరుపమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులెన్ని ఉన్నాయి? ఎవరు నిర్వహిస్తున్నారనే లెక్కలు తీయాలన్నాడు.

వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తున్న వారిపై భారీగా జరిమానాలు విధిస్తోంది ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం. నిరసన ప్రదర్శించిన ఒక మహిళకు పది లక్షల జరిమానా పోలీసులు వేసేశారు. అంటే ఇప్పుడు శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా లేదు. లక్షలాది రూపాయల జరిమానా విధిస్తూ పోలీ సులే తీర్పు చెప్పేస్తున్నారు.

కాన్పూరులో శ్రీరామనవమి ర్యాలీలో హింసాకాండకు పాల్పడ్డారు.


ఈ పరిస్థితులు ఏం చెబుతున్నాయి? దేశంలో ఎలాంటి వాతావరణాన్ని సూచిస్తున్నాయి?

కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా విచిత్రంగా వక్ఫ్ చట్టాన్ని సమర్థిస్తూ మాట్లాడింది. కాని ఆరెస్సెస్ పత్రికలో కేథలిక్ చర్చిల ఆస్తులపై వ్యాసం వచ్చింది. తర్వాత ఆ వ్యాసాన్ని ఆర్గనైజర్ తొలగించినప్పటికీ వక్ఫ్ తర్వాత ఎవరిని లక్ష్యంగా చేసుకోబోతున్నారో స్పష్టమైంది. కేథలిక్ బిషప్పుల సంస్థ వైఖరిని క్రయిస్తవ నేతలు, కార్యకర్తలు నిరసిస్తూ ప్రకటనలు చేశారు.

ఈ నేపథ్యంలో ప్రజలందరూ దేశ పరిస్థితులపై ఆలోచించ వలసిన అవసరం ఉంది. ఈ మతతత్వ రాజకీయాలు దేశాన్ని ఎటు తీసుకుపోతున్నాయో అందరూ ఆలోచించాలి.

కవరు కథనం

అబ్దుల్ వాహెద్




# వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం?

**దిల్ నా ఉమ్మీద్ తో నహీ నా కామ్ హీ తో హై**
**లంబీ హై గమ్ కి షామ్ మగర్ షామ్ హీ తో హై**

ప్రముఖ ఉర్దూ కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన పంక్తులివి. ప్రస్తుతం దేశంలోని పరిస్థితుల్లో ఈ పంక్తులను గుర్తు చేసుకోవడం అవసరం.

పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీ, బుల్డోజర్ న్యాయం– వీటన్నింటి మధ్య ఇప్పుడు వక్ఫ్ చట్టం. ఈ పరిస్థితుల్లో నిరాశ తప్ప మరేముంటుంది? వక్ఫ్ చట్టానికి ఉమ్మీద్ అంటే ఆశ అని పేరుపెట్టినా అందులోని మోసం స్పష్టంగానే తెలుస్తోంది. ఇది మోసం అంటే నమ్మబుద్ధి కావడం లేదా?

మహారాష్ట్ర నుంచి వచ్చిన వార్త చదివితే సత్యం బోధపడుతుంది. బీజేపీ మిత్రపక్షం శివసేన (షిండే) నాయకుడు నిరుపం ఈ చట్టం వచ్చిన వెంటనే పత్రికా సమావేశంలో మాట్లాడుతూ మహారాష్ట్రలో వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వం ఒక వివరణాత్మక నివేదిక తీసుకురావాలన్నాడు. ఈ ఆస్తులు ఎవరి నిర్వహణలో ఉన్నాయో బయటపెట్టాలని అన్నాడు. ఈ నిరుపం గారే వక్ఫ్ చట్టంపై షాహీన్ బాగ్ మాదిరి నిరసనలు జరిగితే జలియన్ వాలా బాగ్ అయిపోతుందని బెదరించాడన్నది కూడా గుర్తించాలి. కాబట్టి అప్పుడే వక్ఫ్ ఆస్తుల్లో వేటిపై వేటు వేయాలన్న ప్రణాళికలు మొదలయ్యాయి. కాబట్టి వక్ఫ్ చట్టంలో ఉమ్మీద్ అంటే ఆశ కన్నా నిరాశే ఎక్కువ కనిపిస్తోంది. అందుకే ఫైజ్ కవిత ఉదాహరించాను.

## నిరాశ లేదు, వైఫల్యం మాత్రమే

చీకటి రాత్రి ఎంత పెద్దదయినా ఒక్క రాత్రి మాత్రమే అన్నాడాయన.

ఈ వైఫల్యాలు, అపజయాల రాత్రి కూడా గడిచిపోతుంది. ఉషోదయం రాక తప్పదు.

## వక్ఫ్ చట్టంపై ప్రతిస్పందనలు:

సరే రాజకీయ నాయకులు వారి వ్యాఖ్యలు, వారి రాజకీయాలు ఓట్ల చుట్టూ తిరుగుతుంటాయి. సాధారణ ప్రజలు

ఏమనుకుంటున్నారన్నది ముఖ్యంగా ఆలోచించవలసిన విషయం.

వక్ఫ్ చట్టం వచ్చినంత మాత్రాన సగటు హిందువుకు ఒరిగేదేముంది?

త్రిపుల్ తలాక్ చట్టం వచ్చినంత మాత్రాన సగటు హిందువుకు ఒరిగిందేమిటి?

పౌరసత్వ సవరణ చట్టం వల్ల సగటు హిందువుకు ఏమన్నా లాభమా?

సగటు హిందువులకే కాదు సగటు పౌరులెవ్వరికీ వీటి వల్ల ఒరిగిందేమీ లేదు. ఎవరి బతుకులూ మారవు. ఉద్యోగాలు రావు. ధరలు నేలకు దిగవు. పెట్రోలు మంటపెడుతూనే ఉంటుంది.

కాని మోడీ ముస్లిముల్ని భలే దెబ్బతీశాడ్రా అనుకునేవాళ్ళు కూడా చాలా మంది ఉండవచ్చు.

కారణాలేమైనా కాని, ఇలాంటి పనులు చేయడం వల్ల హిందూ ముస్లిం ఓట్లను చీల్చి 80, 20 నిష్పత్తి రాజకీయాలతో లాభపడే ప్రయత్నాలు జరుగుతూ వస్తూనే ఉన్నాయి. లాభాలు కూడా లభిస్తూనే ఉన్నాయి.

అయితే సగటు ముస్లిములు ఈ చట్టం గురించి ఏమనుకుంటున్నారు? అనేది కూడా ఆలోచించుకోవలసిన ప్రశ్న.

త్రిపుల్ తలాక్ చట్టం వల్ల సగటు ముస్లిముకు వచ్చిన నష్టం ఏదీ లేదు. ఎందుకంటే, త్రిపుల్ తలాక్ సంఘటనలు చాలా అరుదు. కాని ఈ చట్టంలో వివక్ష ఉంది. ఇతర మతాల్లో విడాకుల వ్యవహారాలు సివిల్ కేసులైతే ఈ చట్టం దాన్ని క్రిమినల్ కేసుగా మార్చేసింది. త్రిపుల్ తలాక్ సాకుతో ముస్లిం పురుషులను జైళ్ళకు పంపే చట్టంగా గుర్తింపు పొందింది. ఇది సగటు ముస్లిముకు వచ్చిన నష్టం. ముస్లిముల పట్ల ఈ వివక్షను సగటు హిందువు మెచ్చుకుని ఓటేస్తాడన్నది మతతత్వ శక్తుల ఉద్దేశ్యం.

అలాగే వక్ఫ్ బోర్డు వల్ల సగటు ముస్లిముకు వచ్చిన లాభమేమిటి? అని కూడా చాలా మంది ప్రశ్నిస్తూ ఉంటారు. నిజంగా సగటు ముస్లిముకు ఎలాంటి లాభం పైకి కనిపించకపోవచ్చు. కాని వక్ఫ్ ఆస్తుల వల్ల సగటు ముస్లిములకు ప్రయోజనాలు కలుగుతున్నాయన్నది ఒక వాస్తవం. ఆ వాస్తవాన్ని సగటు ముస్లిములు కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

ఒక సముదాయంగా ముస్లిములకు మస్జిదులు, మదరసాలు (పాఠశాలలు), వృత్తి విద్యా సంస్థలు, కబ్రస్తాన్లు, వైద్యసౌకర్యాలు,

జకాత్ తర్వాత ఇస్లాంలో ప్రజా ప్రయోజనాల కోసం ఉద్దేశించిన వ్యవస్థ వక్ఫ్. జకాత్ అనేది తక్షణ సంక్షేమం అయితే, వక్ఫ్ అనేది దీర్ఘకాలిక సంక్షేమ కార్యక్రమం. ఇస్లాం ప్రారంభకాలంలో మదీనాలో కట్టిన మస్జిదె ఖుబా కూడా వక్ఫ్ వల్లనే నిర్మించారు. మస్జిదుల నిర్మాణం, ఖబరస్తాన్లు, మదరసాలు, ఆసుపత్రుల నిర్మాణం, విద్యాసంస్థల నిర్మాణం ఇవన్నీ వక్ఫ్ వ్యవస్థ క్రింద చారిత్రకంగా జరుగుతూ వస్తున్నాయి.

అనాథాశ్రయాలు, పునరావాస కార్యక్రమాలు, వడ్డీరహిత రుణసంస్థలు ఇలాంటివెన్నో కావలసి ఉంటుంది. అలాగే ముస్లిముల్లో పేదకుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు కూడా అవసరమవుతాయి.

జకాత్ తర్వాత ఇస్లాంలో ప్రజా ప్రయోజనాల కోసం ఉద్దేశించిన వ్యవస్థ వక్ఫ్. జకాత్ అనేది తక్షణ సంక్షేమం అయితే, వక్ఫ్ అనేది దీర్ఘకాలిక సంక్షేమ కార్యక్రమం. ఇస్లాం ప్రారంభకాలంలో మదీనాలో కట్టిన మస్జిదె ఖుబా కూడా వక్ఫ్ వల్లనే నిర్మించారు. మస్జిదుల నిర్మాణం, ఖబరస్తాన్లు, మదరసాలు, ఆసుపత్రుల నిర్మాణం, విద్యాసంస్థల నిర్మాణం ఇవన్నీ వక్ఫ్ వ్యవస్థ క్రింద చారిత్రకంగా జరుగుతూ వస్తున్నాయి. ముస్లిం ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో వక్ఫ్ గురించి పర్యాటకుడు ఇబ్నె జుబైర్ వివరణలున్నాయి. లోక్‌సభలో పచ్చి అబద్ధం చెబుతూ సంబిత్ పాత్ర వివిధ దేశాల్లో వక్ఫ్ అనేదే లేదన్నాడు. సౌదీ అరేబియాలోని కింగ్‌అబ్దుల్లా యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 20 బిలియన్ డాలర్ల వక్ఫ్. ఇస్లామిక్ యూనివర్శిటీ మలేషియా, హందర్ద్ యూనివర్శిటీ ఇండియాలు కూడా వక్ఫ్ వల్లనే ఏర్పడ్డాయి. ప్రస్తుతం జాకిర్ హుస్సేన్ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన అతి పెద్ద కాలేజి. ఇది కూడా వక్ఫ్ ద్వారానే ఏర్పాటైన చరిత్ర ఉంది. మదరసాయే ఆలియా లేదా కలకత్తా మదరసాలో న్యాయశాస్త్రం, వైద్యశాస్త్ర బోధనలు

జరిగేవి. ఇది1780లో ఏర్పడింది. తర్వాత ముహమ్మదన్ కాలేజ్ ఆఫ్ కలకత్తాగా మారింది. తర్వాత ఆలియా విశ్వవిద్యాలయం అయ్యింది. అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి కూడా పునాది వక్ఫ్. 1921లో అవిభక్త భారతంలో ఢాకా విశ్వవిద్యాలయం ఏర్పాటు కూడా వక్ఫ్ వల్లనే జరిగింది. జామియా మిల్లియా ఇస్లామియా దేశంలో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం. ఇది కూడా వక్ఫ్ వల్లనే. సుమారు 18 వేల మదరసాలు, స్కూల్స్, 350 వరకూ కాలేజీలు వక్ఫ్ ఆస్తుల్లో నడుస్తున్నాయని తెలుస్తోంది. ఎంఎస్ఎస్ వక్ఫ్ బోర్డ్ కాలెజి, తమిళనాడు వక్ఫ్ మెడికల్ కాలేజిలు కూడా ఉన్నాయి. ఇక వైద్యరంగంలో 200 హాస్పిటల్స్ నడుస్తున్నాయని తెలుస్తోంది. దాదాపు 2000 అనాధాశ్రయాలు నడుస్తున్నాయి. కర్నాటకలో వక్ఫ్ 300 కిలోమీటర్ల గ్రామీణ రహదారులకు నిధులు సమకూర్చిందని తెలుస్తోంది. 9.4 లక్షల ఎకరాల వక్ఫ్ భూములలో సుమారు 2 లక్షల ఎకరాలలో శ్మశానాలు, 1 లక్ష ఎకరాలలో మస్జిదులు, దర్గాలు, యాభైవేల ఎకరాలలో స్కూళ్ళు, 5.9 లక్షల ఎకరాలు వ్యవసాయ సంబంధ, ఇతర భూములు ఉన్నాయి.

కాబట్టి వక్ఫ్ వల్ల సగటు ముస్లిముకు ఏం ఒరిగిందన్న ప్రశ్న సహేతుకమైనది కాదు. మస్జిదులు ఖబ్రస్తాన్లు ధార్మికంగా ముస్లిములకు మాత్రమే పరిమితమైనప్పటికీ విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఇతర సేవాకార్యక్రమాల్లో అందరికీ ప్రయోజనా లందిస్తున్న వ్యవస్థగా గుర్తించాలి.

## సమస్యలు

నిస్సందేహంగా వక్ఫ్ బోర్డులు, వక్ఫ్ ఆస్తుల వ్యవహారాల్లో అనేక సవాళ్ళున్నాయి. నిర్వహణ లోపాలున్నాయి. పారదర్శకత లేకపోవడం కూడా ఉంది. దురాక్రమణలున్నాయి. వక్ఫ్ బోర్డ్ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో దాదాపు 50 శాతం వక్ఫ్ ఆస్తులు దురాక్రమణకు గురయ్యాయి. అవినీతి మరో సమస్య. ఈ లోపా లను తొలగించడానికి తగిన చర్యలు చేపట్టడం అవసరమే, కాని ఈ సాకు చూపించి వక్ఫ్ ఆస్తులను కబళించే ఎత్తుగడలు అప్రజాస్వామికం, అన్యాయం. కాబట్టి వక్ఫ్ ఆస్తులను, వక్ఫ్ వ్యవస్థను కాపాడుకోవలసిన అవసరం కేవలం ముస్లిములకు మాత్రమే కాదు అందరికీ ఉంది.

ఎందుకంటే –

ముస్లిములకు సంబంధించిన సమస్య దేశానికి సంబంధించిన సమస్య కాదని భావించడం ఒక పొరబాటు. భారతదేశంలో 14.2% మందిని ప్రభావితం చేసే సమస్య ఏదైనా అది దేశానికి చెందిన సమస్యే.

వక్ఫ్ చట్టం ఒక పథకం ప్రకారం జరుగుతున్న ముస్లిం వ్యతిరేక నిర్ణయాల్లో భాగం. రోడ్ల పేర్లు మార్చడం, నగరాలు, పట్టణాల పేర్లు మార్చడం, పాఠ్యపుస్తకాల సిలబస్సులు మార్చడం ద్వారా దేశచరిత్ర, సంస్కృతి, నాగరికతల్లో ముస్లిం చిహ్నాలు తుడిచేసే ప్రయత్నాలు వరుసగా జరుగుతూ వస్తున్నాయన్నది రహస్యమేమీ కాదు. వక్ఫ్ విషయంలో ఇది ఆస్తి సమస్య. ముస్లిముల వద్ద అతి తక్కువ భూమి మాత్రమే ఉండేలా చేయడానికి పన్నిన ఎత్తుగడలో భాగం ఈ చట్టం. భవిష్యత్తులో వక్ఫ్ చట్టం అనేక ఇతర సముదాయాలకు కళ్ళు తెరిపించేది కావచ్చు.

**వక్ఫ్ బోర్డ్ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో దాదాపు 50 శాతం వక్ఫ్ ఆస్తులు దురాక్రమణకు గురయ్యాయి. అవినీతి మరో సమస్య. ఈ లోపా లను తొలగించడానికి తగిన చర్యలు చేపట్టడం అవసరమే, కాని ఈ సాకు చూపించి వక్ఫ్ ఆస్తులను కబళించే ఎత్తుగడలు అప్రజా స్వామికం, అన్యాయం. కాబట్టి వక్ఫ్ ఆస్తులను, వక్ఫ్ వ్యవస్థను కాపాడుకో వలసిన అవసరం కేవలం ముస్లిములకు మాత్రమే కాదు అందరికీ ఉంది.**

బీజేపీ జాబితాలో ఉన్న మూడు ముఖ్యమైన అంశాలు అయోధ్యలో రామమందిరం అయిపోయింది. జస్టిస్ ఆర్.ఎఫ్ నారిమన్ అయోధ్య తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తూ చేసిన వ్యాఖ్యలు హిందూ పత్రిక వెబ్ ఎడిషన్ డిసెంబర్ 7, 2024 తేదీలో వచ్చాయి. ఇక బీజేపీ జాబితాలో రెండవ అంశం కశ్మీరులో అధికరణ 370 తొలగించడం. ఆ పని చేశారు. కాని కశ్మీరులో దీనివల్ల సాధించిందేమిటో ఇంతవరకు మిగిలిన దేశ ప్రజలకు వివరాలు చెప్పలేదు. మూడవది యూనిఫాం సివిల్ కోడ్? కొన్ని రాష్ట్రాల్లో ఇది కూడా అమలులోకి తెచ్చారు. అయితే యూనిఫాం సివిల్‌కోడ్‌లో కొన్ని సముదాయాలకు మినహాయింపులు ఇచ్చారు. అది ఏ విధమైన యూనిఫాం సివిల్ కోడ్. కేవలం ముస్లిములను మాత్రమే లక్ష్యంగా చేసుకుని యూనిఫాం సివిల్ కోడ్ అంటున్నారన్నది అందరికీ తెలుసు. వక్ఫ్ ఆస్తులపై కూడా ఎప్పటి నుంచో కన్నేసి ఉంచారు.

వక్ఫ్ ఆస్తులపై అపోహలు అపార్థాలు సృష్టించే ప్రయత్నాలు ఎప్పటి నుంచో జరుగుతూ వస్తున్నాయి. ఉదాహరణకు

కర్నాటకలో ఇటీవల 40 వక్ఫ్ ఆస్తులు, కబ్రస్తాన్లు, చెరువులు, వ్యవసాయ భూములను నోటీసుపై చేయడం జరిగింది. అలాగే ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ కూడా వందలాది వక్ఫ్ భూములు తమవే అని గత సంవత్సరం చెప్పింది. ప్రస్తుత చట్టం వల్ల ఈ ఆస్తులన్నింటినీ వక్ఫ్ కోల్పోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే ప్రాపగాండ ప్రచారంలో పెట్టడం, వాట్సాప్ యూనివర్శిటీ ద్వారా వైరల్ చేయడం, ఆరోపణలు సంధించడం, క్లెయిములు చేయడం, వివాదాస్పదంగా మార్చడం, తర్వాత ఈ చట్టం సహాయంతో ఆక్రమించుకోవడం ఇప్పుడు తేలికైంది.

### అపోహ 1:
### ఎలాంటి ప్రచారాలు జరుగుతున్నాయంటే

వక్ఫ్ ఆస్తులన్నీ నిజానికి ప్రభుత్వ ఆస్తులనే ప్రచారం ఒకటి జరుగుతోంది. అంటే వీటిని ముస్లిములు అక్రమంగా కబ్జా చేశారన్న ప్రచారం. నిజానికి వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ ఆస్తులు కావు. ఇవి దానం చేయబడిన ఆస్తుల ట్రస్టులు. ఏ విధంగానైతే దేశంలో గుడులకు, చర్చీలకు ఇతర ధార్మిక సంస్థలకు భూ దానాల ద్వారా ఆస్తులు లభించాయో అదేవిధంగా. వక్ఫ్ ఆస్తులు చాలా మంది ముస్లిములు వ్యక్తిగతంగా దానం చేసినవి. అవి ప్రభుత్వ ఆస్తులు కావు. వక్ఫ్ బోర్డులు భారత చట్టాల ప్రకారం ఏర్పడినవే. ఈ బోర్డులు ఈ భూముల నిర్వహణ చూస్తున్నాయి. వీటి ఆర్థిక వ్యవహారాలన్నీ ప్రభుత్వం ఆడిట్ చేస్తుంది.

### అపోహ 2:
### భూముల దురాక్రమణ

మరో అపోహ ఏమిటంటే, ముస్లిం పాలకులు, రాజులు హిందువుల భూములను బలవంతంగా లాక్కుని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించారన్నది. ఈ ప్రచారం వల్ల హిందువులు ముస్లిముల మధ్య చిచ్చు పెడుతున్నారు. నిజానికి హిందూ, ముస్లిం రాజులందరు భూదానాలిచ్చారు. గుడులకు భూదానాలు, మాన్యాలిచ్చిన రాజులున్నట్లే, వక్ఫ్‌కు భూములిచ్చిన ముస్లిం పాలకులు కూడా ఉన్నారు. ముస్లిం పాలకులు వక్ఫ్‌కు మాత్రమే కాదు, గుడులకు కూడా మాన్యాలిచ్చిన ఫర్మానాలున్నాయి. అలాగే ఒకసారి వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తిని అమ్మడానికి వీలు లేదు. బ్రిటీష్ కాలంలో కూడా ఈ ఆస్తులను చట్టబద్ధమైనవిగా గుర్తించారు. హిందువుల నుంచి లాక్కుని ముస్లిములకు భూములు కట్టబెట్టారనే ప్రచారం నిజానికి ఇటీవల లోక్ సభ ఎన్నికల సందర్భంగా మీ మంగళసూత్రాలు లాక్కుంటారు, మీ గేదెలు, బర్రెలు లాక్కుని వాళ్ళకిచ్చేస్తారనే ప్రచారం వంటిదే.

### అపోహ 3:
### వక్ఫ్ ఆస్తుల విస్తరణ నిరంతరం కొనసాగుతోంది

వక్ఫ్ ఆస్తులు నిరంతరం ఇష్టమొచ్చినట్లు పెరిగిపోతున్నాయనే ప్రచారం ఒకటి ఉంది. నిజానికి వక్ఫ్ ఆస్తులు చాలా పరిమిత మైనవి. కొత్తగా వక్ఫ్ చేస్తున్నవాళ్ళు ఇప్పుడు చాలా అరుదు. చాలా వరకు వక్ఫ్ ఆస్తులు చారిత్రకంగా వక్ఫ్ అయినవి. ఇందులో చాలా ఆస్తులు చిన్న చిన్న భూభాగాలు. అంటే మస్జిదులు, కబ్రస్తాన్లు, మదరసాలు ఉన్నవి మాత్రమే. ఇవి పెద్ద పెద్ద భూభాగాలు కాదు. నిజానికి దేశంలోని భూభాగంలో వక్ఫ్ ఆస్తులు 1 శాతం కూడా లేవు. కాగా; దేశంలో ముస్లిముల జనాభా 14 శాతం.

### అపోహ 4:
### వక్ఫ్ ఆస్తుల వల్ల కేవలం ముస్లిములకు మాత్రమే ప్రయోజనం

మస్జిదులు, ఖబ్రస్తాన్ల వంటి ధార్మిక స్థలాలను వదిలేస్తే మిగిలిన వక్ఫ్ సంక్షేమ కార్యక్రమాలన్నింటా మతవివక్ష ఉండదు. ఆసుపత్రులు, స్కూళ్ళు, అనాథాశ్రయాల వంటివి చారిత్రకంగా అన్ని మతవర్గాల వారికి సేవలందిస్తూ వస్తున్నాయి.

మొదట వాళ్ళు కమ్యూనిస్టుల కోసం వచ్చారు
నేనేమీ మాట్లాడలేదు
నేను కమ్యునిస్టును కాను కదా
తర్వాత వాళ్ళు సోషలిస్టుల కోసం వచ్చారు
నేనేమి మాట్లాడలేదు
నేను సోషలిస్టును కాను కదా

...............

...............

తర్వాత వాళ్ళు నా కోసం వచ్చారు
నా కోసం మాట్లాడడానికి
ఎవరు మిగల్లేదు
– మార్టిన్ నీమోలా

ఈ కవిత ఇప్పుడు ఒకటికి పదిసార్లు చదువుకోవడం అవసరం.

వక్ఫ్ బిల్లు పాసయిన వెంటనే రాహుల్ గాంధీ చెప్పిన మాట నిజమైంది. ఇతర మతాల ఆస్తులపై కన్నేస్తారని రాహుల్ గాంధీ చెప్పారు. బిల్లు పాసయిన వెంటనే ఆరెస్సెస్ మౌత్ పీస్ ఆర్గనైజ రులో ఒక వ్యాసం వచ్చింది. ఇది క్యాథలిక్ చర్చిలకు ఉన్న ఆస్తుల గురించిన వ్యాసం. అయితే తర్వాత ఈ వ్యాసాన్ని

ఆర్గనైజర్ తొలగించింది. కాని గోడమీది రాత స్పష్టంగా అందరికీ కనిపించింది. విచిత్రమేమిటంటే కేరళ కేథలిక్కులు ఈ వక్ఫ్ బిల్లును సమర్ధించారు. సమర్ధించినంత సేపు పట్టలేదు వాస్తవం మింగుడుపడడానికి. గురుద్వారా యాక్ట్‌పై కూడా దృష్టిపడవచ్చనే భయాలున్నాయి. పంజాబులో ముస్లిములు రెండు శాతం కూడా లేరు. కాని అక్కడ సిక్కు అకాల్ తక్త్ జతేదారులు ముస్లిము నేతలతో సమావేశమవుతున్నారు. చట్టబద్దంగా వక్ఫ్ కోసం పోరాడ్డానికి సిద్ధమవుతున్నారన్న వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం ఆదివాసీ భూములను కూడా లక్ష్యంగా చేసుకుంటుందన్న భయాలు మొదలయ్యాయి.

## వక్ఫ్ బిల్లు పై అబద్ధాలు

ఈ చట్టం ఇప్పుడు అందరిలోనూ కదలిక తీసుకువస్తోంది. ఈ చట్టం చాలా గొప్పదని ప్రభుత్వం ఎంత ప్రచారం చేసినా నమ్మడానికి చాలా మంది సిద్ధంగా లేరు. ఈ చట్టం పేద ముస్లిముల బాగు కోసం తీసుకొచ్చామని మంత్రి కిరణ్ రిజిజు అన్నాడు. వక్ఫ్ అనేది స్వతహాగా ధార్మిక వ్యవస్థ. పేదరిక నిర్మూలన అనేది ప్రభుత్వ బాధ్యత. వక్ఫ్ చట్టంతో పేద ముస్లిముల బాగు కోసం ప్రయత్నిస్తామని చెప్పడమంటే తమ బాధ్యత నుంచి చేతులు దులుపుకుంటున్నారా? ముస్లిములైనా, హిందువులైనా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం పనిచేయవలసిన అవసరం లేదా? ఒకవేళ పేదరిక నిర్మూలన కోసమే ఈ వక్ఫ్ చట్టం తీసుకువచ్చినట్లయితే ఇదే లాజిక్ ప్రకారం హిందూ గుడులు, ట్రస్టులకు చాలా ఆస్తులున్నాయి. వాటిని కూడా పేద హిందువుల బాగు కోసం ఉపయోగించే చర్యలు తీసుకుంటారా? పేద రైతులు, నిరుద్యోగ పేద హిందువుల బాగు కోసం ఇలాంటి ప్రయత్నం అక్కడ ఎందుకు చేయడం లేదు?

కిరణ్ రిజిజు ప్రకారం చాలా మంది పేద ముస్లిములు ఈ చట్టం తీసుకువచ్చినందుకు ఆయనకు ధన్యవాదాలు చెప్పారంట. కాని అసంఖ్యాకంగా ముస్లిములు ఈ చట్టంపై నిరసన తెలియజేస్తున్నది ఆయనకు తెలియదా?

అబద్ధాలపైనే ఈ మతతత్వ రాజకీయాలు నిలబడి ఉన్నాయి.

షాహీన్ బాగ్ నిరసనలు జరుగుతున్నప్పుడు ఎన్ని అబద్ధాలు చెప్పారు?

రైతు నిరసనలు జరుగుతున్నప్పుడు ఎన్ని అబద్ధాలు చెప్పారు?

కరోనా కాలంలో తబ్లీగ్ జమాఅత్ పేరుతో ముస్లిములను విలన్లు చేయడానికి ఎన్ని అబద్ధాలు ప్రచారంలో పెట్టారు?

ఇప్పుడు వక్ఫ్ బిల్లుపై కూడా అబద్ధాలు చెప్పడం తప్ప మరో విధంగా సమర్థించుకోలేకపోతున్నారు.

మహాకుంభ్ జరిగిన స్థలం తమదే అంటూ వక్ఫ్ బోర్డు ప్రకటించిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అన్నాడు

ఇది అబద్ధం. వక్ఫ్ బోర్డు ఇలాంటి ప్రకటనేది చేయలేదు.

ఈ మాట చెప్పిన వాడు షాబుద్దీన్ రజ్వీ అనే బీజేపీ కీలుబొమ్మ లాంటి మౌలానా. తమ స్వార్థం కోసం బీజేపీలో చేరి ఇలాంటి మాటలు చెప్పే చాలా మంది గెడ్డం, టోపీల ముస్లిములు కనిపిస్తారు.

మహాకుంభ్ భూమి విషయమై వక్ఫ్ బోర్డు ఎలాంటి ప్రకటన చేయలేదని ఆల్ట్ న్యూస్ పరిశోధనాత్మకంగా ప్రకటించింది.

ఈ ప్రకటన చేసిన షాబుద్దీన్ రజ్వీ గురించి ఇటీవలే ఒక వార్త వచ్చింది. గుర్తుంది కదా. ముహమ్మద్ షమీ రమజానులో ఉపవాసం ఉండకుండా ఎనర్జీ డ్రింక్ తాగుతున్నాడంటూ హంగామా చేశాడు. ఈ హంగామా చేయవలసిన అవసరం ఇతనికేం వచ్చిందని అప్పట్లో గీటురాయిలో నేను రాసిన వ్యాసంలో ప్రశ్నించాను. ఈ షాబుద్దీన్ రజ్వీ ఎవడంటే, మోడీ ఓటేయండి, ఆయన కన్నా గొప్ప నాయకుడు లేడంటూ లోక్ సభ ఎన్నికలప్పుడు ప్రకటించిన ప్రబుద్ధుడు. మోడీకి ఓటేయండని ప్రకటించిన వాడే ఇప్పుడు మహాకుంభ్ స్థలం వక్ఫ్ స్థలమంటూ మరో ప్రకటన చేశాడు. ఇదంతా బీజేపీకి ప్రయోజనాలు చేకూర్చడానికి చెబుతున్న మాటలన్నది స్పష్టం. మహాకుంభ్ జరిగిన స్థలం విషయంలో ఉత్తరప్రదేశ్ వక్ఫ్ బోర్డు ఈ మాటలను ఖండించింది. మహాకుంభ్ జరిగిన ప్రాంతంలో తమ ఆస్తులేవీ లేవని కూడా ప్రకటించింది.

కాని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతూ కుంభమేళ స్థలం తమదే అంటూ వక్ఫ్ బోర్డు వాదిస్తుందన్నాడు.

అలాగే పార్లమెంటులో అనురాగ్ ఠాకూర్, గోలీమారో ఠాకూర్ గా ప్రసిద్ధుడైన ఈ బీజేపీ నాయకుడేమన్నాడంటే, బేట్ ద్వారకా భూమి తమదే అంటూ వక్ఫ్ బోర్డు చెప్పిందన్నాడు. ఇది మరో పెద్ద అబద్ధం. ఈ ఫేక్ న్యూస్ గత మూడేళ్ళుగా చక్కర్లు కొడుతూనే ఉంది. వక్ఫ్ బోర్డు ఇలాంటి క్లెయిమ్ ఏదీ చేయలేదన్నది స్పష్టంగా రుజువయ్యింది. ఈ అబద్ధాన్ని గుజరాత్ వక్ఫ్ బోర్డు కూడా ఖండించింది. బేట్ ద్వారకా భూమిపై తాము ఎలాంటి కేసు వేయలేదని కూడా చెప్పింది. ఇలాంటి అబద్ధాలు ఈ నేతలు సిగ్గులేకుండా చెబుతున్నప్పటికీ స్పీకరు గారు చిరునవ్వులు చిందిస్తూ వింటారు. బీజేపీ నాయకుడు సంబిత్ పాత్ర మరింత సిగ్గులేకుండా లోక్ సభలోనే మాట్లాడుతూ ముస్లిం దేశాల్లోనే వక్ఫ్ అనేది లేనే లేదన్నాడు. అనేక దేశాల పేర్ల జాబితా చదివాడు. నిజానికి ఆ దేశాలన్నింటిలోనూ వక్ఫ్ ఉంది. ఇంత సిగ్గులేకుండా అబద్ధాలు ఎలా చెబుతారు?

ఇన్ని అబద్ధాలు ఎందుకు చెబుతున్నట్లు? ఈ అబద్ధాలు చెప్పి ముస్లిములకు భారతదేశంలో ఎన్నో సదుపాయాలిచ్చేశామని హిందు వుల్లో అపోహలు, భయాలు సృష్టించడానికా?

దేశంలో అత్యధికంగా భూములున్న మూడవ పెద్ద సంస్థ వక్ఫ్ బోర్డు అనేది కూడా అబద్ధమే. స్వయంగా ఆర్గనైజరు వ్యాసం ప్రకారం క్రయిస్తవ చర్చిల వద్ద ఇంతకన్నా ఎక్కువగా ఆస్తులు న్నాయి. నిజం చెప్పాలంటే హిందూ గుడులకు అత్యధికంగా భూములున్నాయి. కేవలం 4 రాష్ట్రాల్లోనే హిందూ ఎండోమెంట్ భూములు 10లక్షల ఎకరాలున్నాయని మజ్లిస్ నేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ వార్త హిందూ పత్రిక వెబ్ ఎడిషన్ సెప్టెంబర్ 21న వచ్చింది.

వక్ఫ్ భూములు కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ అధీనంలో ఉంటాయి కనుక వాటి లెక్కలు ఖచ్చితంగా ఉంటాయి. హిందూమతానికి చెందిన ఆలయ భూములు అలాకాక వివిధ రాష్ట్రాల ఆధీనంలో ఉంటాయి. కేవలం నాలుగు రాష్ట్రాల్లోనే 10 లక్షల ఎకరాలంటే మొత్తం దేశంలో కనీసం 20 లక్షల ఎకరాల వరకు భూము లుండవచ్చు. తమిళనాడులో 4.78 లక్షల ఎకరాల ఆలయ భూములున్నాయట. ఆంధ్రప్రదేశ్‌లో 4 లక్షల ఎకరాలున్నా యట. పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, మహారాష్ట్రాలలో దేవాలయ భూములు ఏ మేరకు ఉన్నాయో అధికారిక గణాం కాలు లేవు. దేశంలో మూడవ అతిపెద్ద భూయాజమాన్యం వక్ఫ్‌దేనని నిన్నటి వరకు ఊదరగొట్టిన వాళ్ళు ఇప్పుడు ఆర్గ నైజరులో క్రయిస్తవుల వద్ద ఇంతకన్నా ఎక్కువ భూములున్నా యని రాసారు. ఏ విధంగా ఈ కుట్రలు కుతంత్రాలు జరుగు తున్నాయో సాధారణ ప్రజలు అర్థం చేసుకోవడం అవసరం.

సచార్ కమిటీ నివేదిక దేశంలో ముస్లిములు అత్యంత వెనుకబడి ఉన్నారని స్పష్టం చేసింది. వెనుకబడిన వర్గాల కన్నా ముస్లిములు అధికంగా వెనుకబాటుకుగురై ఉన్నారని వివరించింది. సచర్ కమిటీ చేసిన సూచనల్లో కీలకమైన ఒక సూచన ఏమిటంటే, వక్ఫ్ ఆస్తులను ముస్లిముల ప్రగతి వికాసాల కోసం ఉపయోగించి ఫలితాలు సాధించవచ్చని చెప్పడం. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ముస్లిముల వక్ఫ్ ఆస్తులనే నిరాకరించే గొప్ప పనికి పూనుకుం టోంది. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే బీజేపీ నినాదం నిజరూపమేమిటో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోడీ గారు చెప్పిన మంగళసూత్రం, బర్రెల వ్యాఖ్యలతో తేటతెల్లమయ్యింది. ఇప్పుడు దీనికి కొనసాగింపే ఈ వక్ఫ్ చట్టం.

నిజానికి ఈ చట్టం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం 1947లో వక్ఫ్ ఆస్తులుగా నిర్ధారించబడిన వాటన్నింటిని మళ్ళీ చర్చకు పెట్టి వక్ఫ్ ఆస్తులపై వేటు వేయడం. వక్ఫ్ చట్టానికి సవరణ ఎందుకు అవసరమయ్యిందన్నది కాస్త లోతుగా ఆలోచించ వలసిన విషయం. బాబరీ మస్జిద్ వివాదం ఇప్పుడు బీజేపీకి రాజకీయంగా ఓట్లు రాబట్టే ఆయుధంగా మిగల్లేదు. అందువల్ల వారణాసిలో మస్జిదు, మధురలో ఈద్గా, మధ్యప్రదేశ్‌లో కమల్ మౌలా మస్జిదు వగైరాలపై కొత్త వివాదాలను రాజేస్తున్నారు. కాని ఈ స్థలాలు వక్ఫ్ ఆస్తులుగా ఉండడం వల్ల చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఇబ్బందులను పరిష్కరించ డానికి ఉద్దేశించినవే ఈ సవరణలు. వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించ బడినవి వక్ఫ్ ఆస్తులు కావని చెప్పడానికి ఇప్పుడు ఈ కొత్త చట్టం అవసరమైంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడి టారిఫ్ నిర్ణయాలు, కుప్పకూలిన షేర్ మార్కెట్, లక్ష కోట్లు నష్టపోయిన మదుపరులు ఇలాంటి అనేక సమస్యలు చర్చకు రాకుండా ఉండాలంటే ముస్లిములను మరో దెబ్బతీశాం చూడండహో అని చెప్పుకునే మరో వార్త కావాలి. అందుకే ఈ వక్ఫ్ చట్టం.

వక్ఫ్ అంటే ధార్మిక సేవా కార్యక్రమాల కోసం ఎవరైనా దానమిచ్చిన ఆస్తులు. దానమివ్వడం అంటే తన ప్రయివేటు ఆస్తిని ఒక వ్యక్తి ధార్మిక కార్యక్రమాల కోసం అంటే మస్జిదు నిర్మాణం కోసం లేదా, ముస్లిం ఖబ్రస్తాన్ కోసం లేదా ముస్లిముల ధార్మిక ఆచరణల కోసం అలాగే సేవా కార్యక్రమాల కోసం అంటే వితంతువుల పెన్షన్లు, పిల్లల చదువులు మొదలైన వాటికి ఆర్థిక సహాయం అందించడానికి దానమిచ్చిన ఆస్తులు. కాబట్టి ఇవి ప్రభుత్వ ఆస్తులు కావు, ప్రయివేటు ఆస్తులన్నది ముందుగా అర్థం చేసుకోవాలి. వక్ఫ్ ఆస్తులను అమ్మడం కాని కొనడం కాని చేయలేరు. అయితే దురాక్రమణల సమస్య ఇతర స్థిరాస్తుల వ్యవహారంలో ఎలా ఉందో అలాగే వక్ఫ్ ఆస్తుల విషయంలోనూ దురాక్రమణల సమస్య ఉంది. ఈ సమస్యను పరిష్కరించి వక్ఫ్ ఆస్తుల నిర్వహణను పటిష్టపరిస్తే, వక్ఫ్ వల్ల వచ్చే ఆదాయమే ముస్లిముల ప్రగతి వికాసాలకు అవసరమైన చర్యలు చేపట్టడానికి సరిపోతుంది. ఇదే విషయాన్ని సచర్ కమిటి చెప్పింది. కాని ఇప్పుడు వక్ఫ్ ఆస్తులనే కబళించే ప్రయత్నాలు మొదలయ్యాయి.

దేశంలో గురుద్వారా చట్టం 1925 ఉంది. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తులను కూడా వ్యవస్థీకరించి ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించాలని చాలా కాలంగా ముస్లిములు కోరుతున్నారు. కాని ఇప్పుడు ప్రభుత్వం మరింత నియంత్రణ తన చేతుల్లోకి తీసుకోవాలని పూనుకుంది.

ఈ చట్టం తర్వాత మారిన పరిస్థితి ఏమిటంటే, ఒక వ్యక్తి చాలా సంవత్సరాల క్రితం తన ఆస్తిని ప్రత్యేక లక్ష్యంతో అంటే పిల్లల చదువు కోసం వక్ఫ్ చేశాడు. కాని ఆ వక్ఫ్ ఆస్తికి

ముతవల్లీగా నియమించబడిన వ్యక్తి ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించలేదు. అప్పుడు పరిస్థితేమిటి? ఇలాంటి సంఘటన ఏదన్నా వక్ఫ్ బోర్డు దృష్టికి వస్తే, అవసరమైన విచారణ తర్వాత వక్ఫ్ బోర్డు ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అధికారాలున్నాయి. అయితే వక్ఫ్ బోర్డు ఏ ఆస్తినైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించడం ఏకపక్షంగా కూడా జరగదు. సాక్ష్యాధారాలు చూపించవలసి ఉంటుంది. సుప్రీంకోర్టు ఫిబ్రవరి 2022 నాటి తీర్పులో కూడా ఈ విషయం స్పష్టంగా ఉంది. వక్ఫ్ బోర్డు నిర్ణయంపై కోర్టుకు వెళ్ళి అప్పీలు చేసుకోవచ్చు. వక్ఫ్ చట్టం ప్రకారం వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించబడినవి సంబంధిత రాష్ట్ర వక్ఫ్ బోర్డు పేర రిజిష్టరవుతాయి. వక్ఫ్ బోర్డు పేరుతో రిజిష్టరైనంత మాత్రాన ఈ ఆస్తికి యాజమాన్య హక్కు వక్ఫ్ బోర్డుకు ఉండదు. కేవలం పర్యవేక్షణ అధికారాలు మాత్రమే ఉంటాయి. నిర్వహణ బాధ్యతలు ముతవల్లీ, మేనేజింగ్ కమిటీలకు ఉంటాయి. ఎవరికి కూడా క్రయవిక్రయాల హక్కు ఉండదు. వక్ఫ్‌బోర్డు చేసే పని ఏమిటంటే వక్ఫ్ ఆస్తి ఏ పని కోసం వక్ఫ్ చేయబడిందో ఆ పనికి మాత్రమే ఉపయోగపడేలా చూడడం, దురుపయోగాలు, దుర్వినియోగాలు, దురాక్రమణలు జరగకుండా చూడడం. క్లుప్తంగా చెప్పాలంటే వక్ఫ్ ఆస్తి ప్రభుత్వ ఆస్తి కాదు, వక్ఫ్ బోర్డుకు క్రయవిక్రయాల హక్కులతో సహా యాజమాన్యహక్కులేవీ లేవు.

కాబట్టి వక్ఫ్ ఆస్తులు ఇచ్చింది ముస్లిములే. ఇవి వారి ఆస్తులే. వక్ఫ్ ఆస్తుల్లో రెండు రకాలున్నట్లు మనం గమనించవచ్చు. ముస్లిములు దానమిచ్చిన ఆస్తులుగా స్పష్టమైన దస్తావేజులు ఉన్న ఆస్తులు. అంటే వక్ఫ్ నామా ఉన్న ఆస్తులు. ఇవి మొదటి రకం. రెండవ రకం ఏమిటంటే, స్పష్టమైన దస్తావేజులు లేకపోయినా సుదీర్ఘకాలంగా ప్రత్యేక కార్యక్రమాల కోసం ఉపయోగపడుతూ వచ్చిన ఆస్తులు. ఉదాహరణకు ఏదన్నా ప్రదేశం వందేళ్ళకు మించి ఖబ్రస్తాన్‌గా ఉపయోగపడుతూ వస్తూంటే దాన్ని వక్ఫ్ ఆస్తిగానే పరిగణించడం జరుగుతుంది. అలాగే ఏదన్నా మస్జిదులో శతాబ్దాలుగా నమాజులు జరుగుతుంటే ఆ మస్జిదు స్థలానికి సంబంధించి వక్ఫ్ పత్రాలు లేకపోయినా అది కూడా వక్ఫ్‌గానే పరిగణించబడుతుంది. ఈ రెండవ రకానికి సంబంధించి వివాదముంది., ప్రస్తుతమున్న వక్ఫ్ చట్టం ప్రకారం కూడా రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల సర్వే ప్రభుత్వం నియమించే సర్వేయర్ మాత్రమే చేస్తారు. ఆ ఆస్తి విషయంలో ఏవైనా అభ్యంతరాలు వస్తే వాటిని కూడా రికార్డు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. ఆ నివేదికను ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు పంపిస్తుంది. వక్ఫ్ బోర్డు తన జవాబు ఇస్తుంది. ఇలా ఈ ప్రక్రియ ముగిసి వక్ఫ్ ఆస్తిగా నిర్ధారణ జరిగిన తర్వాతనే గెజిట్‌లో వస్తుంది.

వక్ఫ్ ఆస్తుల క్రయవిక్రయాలు జరిగే అవకాశం లేదని చెప్పుకున్నాం. కాని చాలా సందర్భాల్లో వక్ఫ్ ఆస్తుల దురాక్రమణల గురించిన వార్తలు కూడా వస్తుంటాయి. విషయమేమిటంటే, ఏ స్థిరాస్తికి సంబంధించైనా తగాదాలు రావడం జరుగుతుంది. ప్రయివేటు ఆస్తులైనా, ప్రభుత్వ ఆస్తులైనా ఇలాంటి వివాదాలు వస్తుంటాయి. దురాక్రమణలు స్థిరాస్తుల విషయంలో జరగడం, వివాదాలు తలెత్తడం ఇతర స్థిరాస్తుల విషయంలో ఎలా జరుగుతుందో వక్ఫ్ ఆస్తుల విషయంలో కూడా అలాగే జరుగుతుంది. వక్ఫ్ ఆస్తికి ఉన్న ఒక రక్షణ ఏమిటంటే, వక్ఫ్ ఆస్తి క్రయవిక్రయాలు చట్టవిరుద్ధం కాబట్టి వక్ఫ్ బోర్డు ఆ ఆస్తిపై తన హక్కును తిరిగి పొందే ప్రయత్నాలు చేయడానికి సానుకూలత ఉంది. ఏదన్నా స్థిరాస్తి ఎవరి అధీనంలోనైనా పన్నెండు సంవత్సరాలు, లేదా ముప్ఫయి సంవత్సరాలుగా ఉంటే సాధారణంగా ఆ ఆస్తిపై అతనికి యాజమాన్య హక్కులు లభించే అవకాశం ఉంటుంది. కాని వక్ఫ్ ఆస్తి విషయంలో ఇది వర్తించదు. ఉదాహరణకు ఏదైనా ఆస్తి ఒక వ్యక్తి అధీనంలో ఉంది. యాభై సంవత్సరాలకు పైబడి అతను ఆ ఆస్తిని అనుభవిస్తున్నాడు లేదా మరొకరికి అమ్మేశాడు. ఆ ఆస్తి వక్ఫ్ ఆస్తి అని దస్తావేజులు వక్ఫ్ బోర్డు వద్ద ఉంటే, వక్ఫ్ బోర్డు ఆ ఆస్తిని తిరిగి రాబట్టుకునే ప్రయత్నాలు చేయవచ్చు. ఇది లిమిటేషన్ చట్టం నుంచి మినహాయింపు. ఈ మినహాయింపు ఇతర మతవర్గాల ధార్మిక ఆస్తులకు కూడా వర్తిస్తుందన్నది గుర్తించాలి. ఇప్పుడు ఈ లిమిటేషన్ తొలగించారు. అంటే ఇప్పుడు ఎవరైనా వక్ఫ్ ఆస్తి కబ్జా చేసుకుని పన్నెండేళ్ళకు పైబడి అనుభవిస్తుంటే ఇక ఆ ఆస్తిని తిరిగి పొందే అవకాశం వక్ఫ్ బోర్డుకు లేదు.

వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో అవకతవకలు అనేకం ముందుకు వచ్చాయి. ఆస్తులు దురాక్రమణలకు గురయ్యాయి. ఫలితం పేద ముస్లిములకు అందవలసిన సేవలు అందడం లేదు. అవినీతి పెరిగిపోయింది. వక్ఫ్ ఆస్తుల వల్ల కొందరు మాత్రమే ప్రయోజనాలు పొందుతున్నారని, సగటు ముస్లిములకు, పేద ముస్లిములకు దానివల్ల వితంతు పించన్లు, అనాధ పిల్లలకు నామమాత్ర సహాయాలు తప్ప మరేమీ లభించడం లేదన్న విమర్శ కూడా ఉంది.

వక్ఫ్ బోర్డులు సక్రమంగా తమ విధులు నిర్వర్తించి ఉంటే నేడు పరిస్థితి ఇలా ఉండేది కాదు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణను మరింత పటిష్టంగా మార్చే బదులు ఇప్పుడు వక్ఫ్ ఆస్తులను నిర్వీర్యం చేసే చట్టం వచ్చింది. బీజేపీకి ఈ చట్టం రాజకీయంగా లాభిస్తుందా అన్నది చరిత్రే చెప్పాలి.

✤ ✤ ✤




- ఎస్.ఎమ్. మలిక్

### గమనార్హమయిన విషయం

ఒక విషయాన్ని మనం ప్రథమంగా గుర్తుంచుకోవలసి ఉంటుంది. ఇస్లామ్ సందేశం దైవం అందజేసిన సందేశం. ఇది ఏ మానవుని సందేశం కాదు. ఈ సందేశాన్ని నిత్యం దేవుని ప్రవక్తలు ప్రజలకు అందజేస్తూ వచ్చారు. దైవ పథకం ప్రకారం దైవం పంపిన కడపటి ప్రవక్త మహనీయ ముహమ్మద్(స) తరువాత మరే ప్రవక్తా రాబోవటం లేదు, గనక ఆయన తరువాత ఈ సందేశాన్ని అందజేసే బాధ్యత ఈ సందేశాన్ని విశ్వసించేవారికి అప్పజెప్పడం జరిగింది. ఈ బాధ్యత వాస్తవానికి ప్రవక్తల బాధ్యత, ఈ విషయాన్ని సందేశ దాత ఒక్క క్షణం కూడా మరువరాదు. సందేశదాత దిగువ రీతిలో సన్నద్ధుడవ్వాలి :

- ✤ ఒకరి మన్నన కొరకో, మెప్పు కొరకో కాదు ఈ పని కేవలం దైవప్రసన్నత కొరకే అన్న సంకల్పశుద్ధితో చేయాలి.
- ✤ సందేశం అందజేస్తూ ప్రవక్తశ్రీ (స) ఆదర్శాన్ని ముందుంచుకోవాలి. ఆయన ఎదుర్కొన్న అవరోధాలు, ఇబ్బందులు నిత్యం దృష్టిలో ఉండాలి.
- ✤ ఇది పూల బాట కాదు, దీన్ని ఆహ్వానించే వారు కొంద రయితే ముళ్ళ పరపులు పరిచే వారే అధికం. అన్నింటికీ సిద్ధమయి అడుగు వేయాలి.

### సందేశం

“అల్లాహ్ ఆదమ్ (అలైహిస్సలామ్)ను సృష్టించినప్పుడు ఆయనతోపాటే మానవుని మార్గదర్శకత్వం కూడా ఏర్పాటు చేశాడు. ఆ తరువాత సందర్భానుసారం, దైవ పథకం ప్రకారం దేవుని సందేశహరులు, మానవాళికి దేవుని మార్గ దర్శకత్వం తెలుపడానికి ఆవిర్భవిస్తూ వచ్చారు. దేవుని మార్గ బోధన మానవులకు లభిస్తూ వచ్చింది.” ఇది ముస్లిముల దృఢ విశ్వాసం, (ఇక్కడ చర్చనీయాంశం కాదు.) దైవ గ్రంథం దివ్య ఖుర్ఆన్‌లో సూత్రప్రాయంగా ఒక విషయం చెప్పడం జరిగింది. మానవాళి సముదాయంగా నివసించిన ప్రతి చోటా, ప్రతి జాతికీ దైవం తన మార్గదర్శకత్వం అందజేసే ఏర్పాటు చేశాడు-

***“లి కుల్లి కౌమిన్ హాద్!”*** - ప్రతి జాతికి మార్గబోధన చేసే వారు ఒకరు ఉన్నారు. - *(అర్ రాద్. 13: 7).*

దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ మార్గబోధన చేసిన వారిని అందరినీ కాదు, కొందరిని మటుకే పేర్కొనడం జరిగింది. కొందరు ప్రవక్తల వివరాలు, కొన్ని దైవిక గ్రంథాల ప్రస్తావన మాత్రమే అందులో ఉంది, అధికాంశం ప్రస్తావనకు రాలేదు. కొన్ని దైవ గ్రంథాలను పేర్కొన్నా, అవి నేడు మనకు ప్రాప్తం కావు. ఉదాహరణకు "సుహుఫె ఇబ్రాహీమ్"ని దివ్య ఖుర్‌ఆన్‌లో ఉల్లేఖించడం జరిగింది. కాని నేడు ఏ రూపంలోనూ దాని ఆచూకీ మనకు తెలియదు. అందువల్ల దైవ గ్రంథాల విషయంలో కొన్ని సూత్రప్రాయమయిన విషయాలను సదా గుర్తుంచుకోవాలి, వాటినే జాగ్రత్తగా పాటించాలి. ఇది సందేశం అందజేయడంలో ప్రధాన విషయం.

## ప్రకృతి నిదర్శనాల ఆధారం

దివ్య ఖుర్‌ఆన్, దాని సందేశాన్ని ప్రకటించే నిమిత్తం అవలంబించిన ఒక విధానం మౌలికంగా "బుద్ధి"ని మేల్కొలపడం. సృష్టిలోని నిదర్శనాలను, విశ్వవ్యవస్థ నిర్వహణ, దాని నిదర్శనాలను, అది బలోపేతంగా మానవాళి సమక్షంలో పెడుతుంది. మనిషి తన బుద్ధి బలాన్ని, వివేకాన్ని, వివేచనను, విచక్షణా జ్ఞానాన్ని వినియోగించాలని నొక్కి పలుకుతుంది.

✤ *ఆయన (దైవత్వ) సూచనలలో ఒకటి, ఆయన మీ కొరకు మీ (మానవ) రాశి నుంచే మీ భార్యల్ని సృజించాడు, మీరు వారి వద్ద నెమ్మదిని, ఆనందాన్ని పొందాలని, మరి మీ మధ్యన ప్రేమ, కారుణ్యం నెలకొల్పాడు. నిశ్చయంగా వీటిలో యోచించే, ఆలోచించే వారి కొరకు అనేకానేక సూచనలున్నాయి.*

*(అర్ రూమ్. 30:21)*

✤ *ఆయనే అల్లాహ్, మరణ సమయాన ఆత్మల్ని వశ పరచుకునేవాడు, ఇంకా మృత్యువు ఆసన్నం కాని వారి ఆత్మను నిద్ర సమయాన వశపరచుకుని, తాను మృత్యువు నిర్ణయం తీసుకున్న వాని ఆత్మను తన వద్దనే ఆపుకుని ఇతరుల ఆత్మల్ని, నిర్ణీత సమయం వరకు తిరిగి పంపించి వేస్తాడు. ఇందులో చింతన చేసే వారి కొరకు గొప్ప సూచనలున్నాయి. (అజ్జుమర్. 39: 42)*

✤ *ఇంకా, వారు భూమ్యాకాశాల సృష్టి పట్ల లోతుగా చింతన చేసినప్పుడు (వివశతతో ఎలుగెత్తి చాటుతారు), "ప్రభూ! ఇదంతా నీవు అర్థరహితంగా, ఉద్దేశ రహితంగా సృష్టించ లేదు. నీవు పరిశుద్ధుడివి, ఆశయ శూన్యంగా నీవు ఏదయినా సృష్టించడం అన్నది జరగదు. కాగా ప్రభూ! మమ్మల్ని నరకాగ్ని నుండి రక్షించు."*

*(ఆలి ఇమ్రాన్. 3: 191)*

## చింతన, ఆలోచన

దివ్య ఖుర్‌ఆన్‌లో భూమ్యాకాశాల సృష్టి, సూర్యచంద్రుల క్రమ బద్ధమయిన భ్రమణం, ఈ బ్రహ్మాండ నిర్వహణ నిరంతరాయంగా కొనసాగడం పట్ల కానవచ్చే నిర్దుష్ట పరిపాలనా నిబద్ధత, స్వయంగా భూ మండలంలో పర్వతాలు, అసంఖ్యాకమయిన నదీనదాలు, పండ్లు ఫలాల పంటలు, పగలూ రాతిరి - దీనంతటినీ ప్రస్తావించిన తరువాత ఇలా మేల్కొలపడం జరిగింది:

✤ *ఈ విషయాలన్నింటిలో ఎన్నో సూచనలున్నాయి, ఆలోచన, అనుశీలనలతో మసలుకునే వారి కొరకు.*

*(అర్ రాద్. 13: 3)*

జ్ఞాన సంపన్నులయి భూమ్యాకాశాల నిర్మాణం పట్ల ఆసక్తిగా పరిశీలించి, విశ్వ సృజన, విశ్వ నిర్వహణల నిదర్శనాల ద్వారా నిజ జ్ఞానానికి చేరువయినప్పటికీ పైశాచిక వలలోపడి మార్గ భ్రష్టులయ్యే వ్యక్తుల్ని ప్రస్తావించి, దివ్య ఖుర్‌ఆన్ ఇలా అంటుంది:

✤ *మేము అతన్ని మా నిదర్శనాల ద్వారా ఉన్నత స్థానం ప్రసాదించాలని అనుకున్నాము, కాని అతను నేలకే ఒరిగి పోయాడు, తన మనోకాంక్షల వెంట పడి పోయాడు (అల్ ఆరాఫ్. 7: 176)*

ఇంకా స్వయంగా దివ్య ఖుర్‌ఆన్ వంటి మహత్పూర్వక మయిన సూచన, దాని ఉపమానాల పట్ల జనాన్ని ఇలా జాగరూక పరచడం జరిగింది:

✤ *మేము ఈ ఖుర్‌ఆన్‌ని ఏదయినా పర్వతానికి అవతరింపజేసి ఉన్నట్లయితే అది దైవభీతి చేత క్రుంగిపోయి బ్రద్దలవగా నీవు చూసి ఉండేవాడవు. ఈ ఉపమానాలను మేము జనుల సమక్షంలో పెడుతున్నది వారు (తమ స్థితిగతుల పట్ల) ఆలోచించాలని!*

*(అల్ హష్ర్. 59:21)*

దైవ సృష్టిలోని మరో ఉపమానాన్ని ప్రస్తావిస్తూ ఇలా అంటుంది దివ్య ఖుర్‌ఆన్:

✤ *ఈ తేనెటీగలోనుంచే రంగు రంగుల తీయని పానకం*

ద్రవిస్తుంది. ఇందులో జనులకు (వారి వ్యాధుల) చికిత్స ఉంది. నిశ్చయంగా ఇందులోనూ ఆలోచించగలిగే జనుల కొరకు ఓ సూచన ఉంది. *(అన్ నహ్ల్. 16:69)*

- ✤ *ఆయన ఈ (వర్షపు) నీటి ద్వారా పొలాలను పండిస్తాడు, జైతూన్ (ఆలివ్), ఖర్జూరం, ద్రాక్ష, ఇంకా రకరకాల ఇతర ఫలాలనూ పండిస్తాడు. ఇందులోనూ ఓ మహత్తర మయిన సూచన ఉంది, చింతన, ఆలోచన చేసే వారి కొరకు. (అన్ నహ్ల్. 16:11)*
- ✤ *అల్లాహ్ మీ కొరకు సముద్రాన్ని అధీన పరిచాడు, తద్వారా ఆయన ఆదేశానుసారం ఓడలు అందులో సంచరించాలని, మీరూ ఆయన అనుగ్రహాన్ని అన్వే షించి ఆయనకు కృతజ్ఞులవ్వాలనీను. ఆయన భూమ్యా కాశాలలోని సమస్తాన్నీ మీ కొరకు అధీనపరిచాడు- ఇందులో పరిశీలనగా ఆలోచించే వారికొరకు గొప్ప సూచనలున్నాయి. (అల్ జాసియ. 45:12, 13)*

దైవ ప్రవక్త(స)ను పరిచయం చేస్తూ ఇలా అంటుంది కుర్ఆన్:

- ✤ *“నా వద్ద దేవుని ఖజానాలున్నాయని, నాకు అజ్ఞాత విషయాల జ్ఞానముందని, లేదా నేను దైవ దూతను అనీ నేను పలకడం లేదు, (నేను కేవలం మీ వంటి మనిషినే) అయితే నాకు (దైవం) అవతరింపజేసిన దైవవాణి (వహీ)ని అవలంబించేవాడిని నేను” అని ప్రవక్తా, చెప్పివెయ్యి, ఇంకా వారినడుగు, “గ్రుడ్డి వాడూ, చూపు గలవాడూ ఉభయులూ సమానం కాగలరా? మీరు ఏ మాత్రం ఆలోచించరా, ఏమిటీ??” (అల్ అన్ఆమ్. 6:50)*

**ఆత్మావలోకనం**

ఇహలోక జీవితం, మానవ జనన మరణాలు, లోకంలోని ప్రతిదీ నశించి పోవడం- వీటి పట్ల మనిషి ఏమరుపాటును ప్రస్తావిస్తూ దివ్య కుర్ఆన్ అంటుంది:

- ✤ *వారు ఎప్పుడయినా తమ స్వయాన్ని గురించి కూడా ఆలోచించరా? (అర్ రూమ్. 30:8)*
- ✤ *ఈ విధంగానే అల్లాహ్ తన సూచనలను విడమర్చి వివరిస్తాడు, మీరు వాటిని గురించి పరిశీలనగా ఆలో చించాలని. (అల్ బకరా 2 : 266)*
- ✤ *ఈ విధంగా అల్లాహ్ మీ కొరకు తన ఆదేశాలను విశదీక రిస్తాడు, అలాగయినా మీరు ఇహపరాల (ఉభయ జీవితాల) పట్ల చింతన చేయాలని. (అల్ బకర. 2:219)*
- ✤ *ఈ విధంగా మేము మాసూచనల్ని విడమర్చి మరీ తెలుపు తున్నాము, ఆలోచించే అర్థం చేసుకునే వారి కొరకు. (యూనుస్. 10:24)*

ఇంత వివరంగా బుద్ధి వివేకాలను వినియోగించాలని కోరడం ఎందుకంటే, ఇలా యోచించినట్లయితే బహు దైవారాధకు లయినా కాదనలేని సత్యం ద్యోతకమవుతుంది. సృష్టి క్రియలో, దాని నిర్వహణలో ఒక్క దైవం తప్ప ఇతరులెవ రయినా భాగస్వాములు కావడం అన్నది అసంభవం అని తేలుతుంది. అలాగే మానవ జీవితానికి కావలసిన నియమా లయినా, శాసనాంగమయినా మనిషి సృష్టికర్త, మనిషిని గురించి సర్వం ఎరిగిన స్వామి తప్ప మరెవరయినా ప్రదానం చేయగలరన్న విషయాన్నీ ఎవ్వరూ సమ్మతించరు. సృష్టించిన వాడే విశ్వాన్ని నిర్వహించాలన్న మాటను అంగీకరించవల సిందే. విశ్వం నిర్విరామంగా నిరంతరాయంగా, ఘర్షణ రహితంగా నడవడానికి అవసరమయిన నియమావళిని చేసిన ఆ ప్రభువే మానవుని కర్త కూడా. ఆ స్వామియే మానవ జీవితానికి, వ్యక్తిగత వ్యవహారాలకయినా సామూహిక కార్య కలాపాలకయినా ఒక పద్ధతిని, ఒక విధానాన్ని, ఒక మార్గాన్ని నిర్దేశించాలన్న విషయాన్నీ ఎవరూ కాదనలేరు. ఇంకా అటువంటి దైవానికి, ఆ ఏకైక మహా శక్తి సరోవరానికి భార్యా పిల్లల్ని ఆపాదించే వాదనను అశాస్త్రీయం (Unscientific) అని కొట్టి పారేసే వారే అధికం! అంగీకరించే వారు బహు స్వల్పం!! **(మిగతా వచ్చే వారం)**

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# భూమి భారం పెరుగుతోందా?

- అమ్రా ఇజాన్

**భారత జనాభా ప్రపంచంలోనే అత్యధిక జనాభాగా మారింది. చైనాను అధిగమించి భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానానికి చేరుకుంది. అధిక జనాభాపై అనేక మంది ఆందోళన వెలిబుచ్చుతున్నారు. జనాభా గురించి పలువురు పలువిధాలుగా మాట్లాడుతున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలు తీరడానికి కావలసిన వనరులు లభిస్తాయా అన్న అనుమానాలు వెలిబుచ్చుతున్నారు.**

కొంతకాలం క్రితం ప్రకృతి భరించే శక్తి (నేచర్ సస్టెయినబిలిటీ) అనే పత్రంలో కొందరు శాస్త్రవేత్తల బృందం భూమి మహా అయితే 700కోట్ల జనాభాను మాత్రమే భరించగలదని చెప్పారు. కాని జనాభా 760 కోట్లని దాటినట్లు తెలుస్తోంది. కొన్ని అంచనాల ప్రకారం జనాభా 800 కోట్లు దాటింది. జనాభా అందరికీ ఉత్తమ స్థాయి జీవితం సాధించడంలో భూమి జీవ భౌతిక పరిమితులు అతిక్రమించడం జరుగుతుందని, దానివల్ల పర్యావరణ సంక్షోభం నెలకొంటుందని అంటారు.

ఈ మాటలు శాస్త్రీయంగా ఖచ్చితమని చెబుతున్నప్పటికీ, ఇవి చాలా పాత మాటలు. ఇవి కొత్తవి కావు. తాజాగా ఇదే పునరుద్ఘాటించడం జరిగింది. జనాభా, జనాభా అవసరాలు త్వరలోనే భూమి భరించే సామర్థ్యాన్ని దాటి పోతాయని అంటున్నారు. ఈ మాటలు నిజానికి 19వ శతాబ్దిలో స్టీం ఓడలు మోసుకువెళ్ళే సరుకుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని చెప్పిన మాటలు. ఆ తర్వాత హఠాత్తుగా ఓడలు, వాహనాల నుంచి 19వ శతాబ్దం చివరి నాటికి భూమి భరించే శక్తిని తీర్మానించే స్థాయికి వెళ్ళాయి. పర్యావరణంలో గడ్డిమైదానాలు ఎంత సంఖ్యలో పశువులకు పోషణనివ్వగలవో చెప్పడం ప్రారంభమైంది.

పర్యావరణానికి సంబంధించి ఈ భావనలో లోపాలున్నాయి. ఓడలు వాటికవే రెట్టింపై పోవు. ఒక పర్యావరణ వ్యవస్థ సామర్థ్యం ఇంజనీర్ డ్రాయింగ్ రూములో నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే, పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా మానవ సమాజాలకు సంబంధించి ఇదే భావనను ఖచ్చితంగా వర్తింప జేస్తున్నామని చెబుతున్నారు. ఈ మాటలు చెప్పింది పర్యావరణ శాస్త్రవేత్త విలియం వోట్. ఆయన మొదటిసారి అంటే 1940

దశాబ్దంలో ఈ మాటలు చెప్పాడు. వ్యవసాయ భూమిని అతిగా వాడడం వల్ల భూమి సారం క్షీణిస్తుందని, చివరకు నాశనమవు తుందని అన్నాడు. 1960 దశకం చివరి నాటికి, 1970 ప్రారంభదినాల్లో పాల్ ఎర్లిచ్ ఆహార ఉత్పత్తిపై దృష్టి పెట్టాడు. తర్వాతి కాలాల్లో పర్యావరణ శాస్త్రవేత్తలు కాలుష్యాలపైనా, పర్యావరణ విధ్వంసంపైనా దృష్టి పెట్టి భూవ్యవస్థపై వాటి ప్రభా వాన్ని అధ్యయనం చేసే ప్రయత్నం చేశారు. భూ వ్యవస్థపైనే మానవజీవితం ఆధారపడి ఉంది.

కాని అందరూ మానవ పునరుత్పత్తి, మానవ అవసరాలకు సంబంధించిన జనాభా నియంత్రణను నొక్కి చెప్పే నియో మాల్థుషియన్ సిద్ధాంతం దృష్టితోనే ఆలోచించారు. 18వ శతాబ్దానికి చెందిన రెవరెండ్ థామస్ రాబర్ట్ మాల్థూస్ నుంచి నేటి వరకు పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నది ప్రగతి వికాసాల వల్ల మనుషుల జనాభా మరింత పెరుగుతోందని, దానివల్ల వనరుల వినియోగం మరింత పెరుగుతుందని చెప్పడమే. అంటే మనుషులు ఏకకణ జీవుల్లా లేదా దీపపు పురుగుల్లా సంఖ్యలో పెరిగిపోతుంటారు. వనరులన్నీ అంతరించి పోయేవరకు జనాభా ఇలా పెరిగిపోతూ ఉంటుందన్నదే ఈ సిద్ధాంతం.

కాని వాస్తవానికి మానవజనాభా పెరుగుదల, వనరుల వాడకం అనేది ఇలా జరగడం లేదు. ప్రగతి వికాసాలు, ఆధునికత వల్ల మానవ పునరుత్పాదక రేటు తగ్గుతోంది కాని పెరగడం లేదు. భౌతికంగా మనిషి జీవన పరిస్థితులు మెరుగైనప్పుడు పిల్లల సంఖ్య తగ్గుతుందే కాని ఎక్కువ కావడం లేదు. గత 200 సంవత్సరాలుగా మానవజనాభా విస్ఫోటం అనేది మానవ పునరుత్పాదక రేటు పెరగడం వల్ల కాదు, శిశుమరణాల రేటు తగ్గడం వల్ల చోటు చేసుకుంది. మెరుగైన ప్రజారోగ్యం, పోషకాహారం, భౌతికమైన వసతులు, ప్రజలకు భద్రత వగైరా కారణాల వల్ల మనుషులు గతంలో కన్నా ఎక్కువ కాలం జీవిస్తు న్నారు.

ప్రస్తుతం అమెరికా, యూరప్, జపాన్, చాలా వరకు లాటిన్ అమెరికా, కొంతవరకు ఇండియాలో పునరుత్పత్తి రేటు తగ్గి పోయింది. దంపతులు ఇద్దరు పిల్లలనే కలిగి ఉంటున్నారు. రానున్న దశాబ్దాల్లో ప్రపంచంలోని చాలా దేశాల్లో ఇలా జరగవచ్చు. ఫలితంగా చాలా మంది డెమోగ్రాఫర్ల ప్రకారం మానవజనాభా గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఆ తర్వాత జనాభా పడిపోవడం ప్రారంభమవుతుంది. ఈ శతాబ్దం చివరి నాటికి చాలా దేశాల్లో జనాభా తగ్గడం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు.

**భూమి సామర్థ్యాన్ని మరింత పెంచడం మనిషికి సాధ్యమే. అణుశక్తి, సౌరశక్తి కావలసిన శక్తి అవసరాలను తీర్చడానికి ఉన్నాయి. పైగా ఇవి కార్బన్ వాయువులు విడుదల చేసే భయం కూడా లేదు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పెరిగి జనాభాకు అవసరమైన ఆహారం కూడా అందించగలవు. కాని ఈ భవిష్యత్తు చాలా మందికి, భూమి సామర్థ్యం పరిమితమని వాదించేవారికి రుచించదు. కాని ఇందులో ఆశావాదం ఉంది. వివేకంతో విజ్ఞానంతో మానవజాతి భవిష్యత్తును నిర్మించుకోగలదు. భూమి సామర్థ్యాన్ని బట్టి జనాభా పెరుగుదలను నియంత్రించాలనుకోవడం సరయిన ఆలోచన కాదు.**

అందువల్లనే నేడు పర్యావరణ సంక్షోభాలకు అధిక జనాభా కారణమన్న వాదన వినబడడం లేదు. వనరుల అతి వాడకం కారణం కావచ్చున్న వాదన వినిపిస్తుంది. ఇప్పుడు చాలా మంది చెప్పేదేమంటే, మానవ సమాజాలు ఏకకణ జీవుల వంటివి కావు. కాని పెట్టుబడి దారి వ్యవస్థ మాత్రం ఏకకణజీవి వంటిదే. వనరులను వాడుకోవడంలో అనియమిత ప్రగతి లేకపోతే బతికి బట్టకట్టలేదు. ఈ వాదనను సమర్థించే ఆధారాలు పెద్దగా లేవు. దీనికి విరుద్ధంగా చాలా మార్కెట్ ఎకానమీ వ్యవస్థలు వనరులను తక్కువ వాడుకుని ప్రగతి సాధించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రజలు గ్రామీణ వ్యవసాయిక నేపథ్యం నుంచి ఆధునిక పారిశ్రామిక ప్రాంతాలకు తరలి పోవడంతో పాటు వారి జీవితా ల్లోనూ మార్పు వచ్చింది. తర్వాత ఈ ధోరణి కూడా తగ్గుముఖం పట్టింది.

సంపన్న ఆర్థిక వ్యవస్థలు కూడా మార్పుకు గురవుతున్నాయి. ఒకప్పుడు ఆర్థిక ఉత్పాదకతలో మాన్యుఫాక్చరింగ్ కేవలం 20 శాతం ఉండేది. ఉద్యోగ కల్పనలో కూడా అంతే వాటా ఉండేది. నేడు ఇది 10 శాతానికి పడిపోయింది. ఇప్పుడు ఆర్థిక ఉత్పాదకత ప్రధానంగా సేవారంగం నుంచి వస్తుంది. ఈ రంగంలో వనరుల వాడకం, శక్తి వాడకం తక్కువే. అభివృద్ధి చెందిన దేశాల్లో దశాబ్దాలుగా ఆర్థిక ప్రగతిలో క్రమేణా వనరుల వాడకం తగ్గుతూ వస్తోంది. ఎందుకంటే డిమాండ్ సంతృప్తస్థాయికి చేరుకోవడం దానికి కారణం. ఏది ఏమైనా భూమి భరించే సామర్థ్యాన్ని మనం దాటిపోయే భయం లేదని కూడా పూర్తిగా చెప్పలేం. నిజానికి కొందరు పర్యావరణ

శాస్త్రవేత్తల ప్రకారం భూమి సామర్థ్యాన్ని మించి పోయింది జనాభా. కాని భూమి సామర్థ్యం స్థిరంగా గతంలో ఊహించినంత మాత్రమే ఉంటుందనుకోవడంలోనే తప్పుంది.

నిజానికి మానవజాతి పర్యావరణాన్ని మరింత ఉత్పాదకంగా మలచుకుంటోంది. అడవులను గడ్డిమైదానాలుగా, వ్యవసాయ భూములుగా మార్చేసింది. మొక్కలు, జంతువులు మనిషికి మరింత ఉపయోగకరమైనవాటిని ఎంచుకోవడం జరిగింది.

ఇక్కడ గమనించవలసిన విషయం మరొకటుంది. 1990ల్లో జపాన్ సాంకేతికంగా ఉచ్ఛ స్థితికి చేరుకుంది. చైనా కూడా గొప్ప అభివృద్ధి నమోదు చేసింది. కాని ఇప్పుడు అక్కడ జనాభా తగ్గి పోవటంతో కొత్త సమస్యలు ప్రారంభమయ్యాయి. ఒక్కసారి జనాభా తగ్గుదల ప్రారంభమైతే ఈ పతనాన్ని నియంత్రించడం కూడా కష్టమని కొందరు నిపుణులు అంటున్నారు. జనాభా స్థిరీకరణకు సంతానోత్పత్తి రేటు 2.1 ఉండాలంటారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ రేటు 1.6కు పడిపోయింది. ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో అసలు సమస్య ఇదే. జనాభా అధికంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు అధిక పార్లమెంటు స్థానాలు తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ స్థానాలు లభిస్తాయన్న ఆందోళనలు పెరిగాయి. అధిక సంతానాన్ని కొందరు రాజకీయ నాయకులు కూడా ఈ సందర్భంగా ప్రోత్సహిస్తూ మాట్లాడారు. జనాభా నియంత్రణ చర్యల వల్ల ముసలివారి జనాభా పెరిగి, కష్టపడి పనిచేసే వయసున్న వారి జనాభా తగ్గే ప్రమాదం కూడా ఉందని కొందరు హెచ్చరిస్తున్నారు.

భూమి సామర్థ్యాన్ని మరింత పెంచడం మనిషికి సాధ్యమే. అణుశక్తి, సౌరశక్తి కావలసిన శక్తి అవసరాలను తీర్చడానికి ఉన్నాయి. పైగా ఇవి కార్బన్ వాయువులు విడుదల చేసే భయం కూడా లేదు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పెరిగి జనాభాకు అవసరమైన ఆహారం కూడా అందించగలవు. కాని ఈ భవిష్యత్తు చాలా మందికి, భూమి సామర్థ్యం పరిమితమని వాదించేవారికి రుచించదు. కాని ఇందులో ఆశావాదం ఉంది. వివేకంతో విజ్ఞానంతో మానవజాతి భవిష్యత్తును నిర్మించుకోగలదు. భూమి సామర్థ్యాన్ని బట్టి జనాభా పెరుగుదలను నియంత్రించాలనుకోవడం సరయిన ఆలోచన కాదు.

మాల్థస్ జనాభా పెరుగుదల గురించి మాట్లాడాడు, ఎర్లిచ్ పేద దేశాలకు ఆహార సహాయాన్ని నిరసించాడు. బలవంతంగా కుటుంబ నియంత్రణ గురించి కూడా వాదించాడు. ఇప్పుడు కోట్లాది మందిని వ్యావసాయిక సంక్షోభంలో ముంచేసే పరిస్థితిని నివారించకుండా భూమి పరిమితుల గురించి మాట్లాడటం జరుగుతోంది. ఏది ఏమైనా, మానవ సమాజాలపై కుహనా కల్పిత పరిమితులను విధించడం సరయిన పద్ధతి కాదు. భూమిపై మానవజాతి చరిత్రను పరిశీలిస్తే మనిషి ఈ భూమిని తన అవసరాలకు అనుగుణంగా అనేకసార్లు అనేక రకాలుగా తయారు చేసుకున్నాడు.

"పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము."

*(దివ్య ఖుర్ఆన్ 17: 31, అల్ అన్ ఆమ్ 6 : 151)*

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**37 ఆయత్‌లు**

# 45. అల్ జాసియ

**మక్కా అవతరణ**

23 మరెప్పుడయినా నీవు ఆ వ్యక్తి పరిస్థితిని కూడా గమనించావా? అతను తన మనోకాంక్షను తన దైవంగా చేసుకున్నాడు, జ్ఞానం ఉన్నప్పటికీ అల్లాహ్ అతన్ని మార్గవిహీనతలో పడవేశాడు. ఇంకా అతని చెవులు, గుండెపైన ముద్రవేశాడు, అతని కళ్ళపైన తెరవేశాడు. అల్లాహ్ తరువాత ఇప్పుడెవరున్నారని అతనికి మార్గ బోధన చేయడానికి? మీరు ఎటువంటి గుణపాఠమూ గ్రహించరా?[33]

24 ఈ జనులు అంటున్నారు, "జీవితమంటే మా ఈ ప్రపంచ జీవితమే, ఇక్కడే మా చావూబ్రతుకు; మరి కాల భ్రమణం తప్ప మరేదీ లేదు మమ్మల్ని అంతమొందించేది." వాస్తవానికి వీరి వద్ద ఈ వ్యవహారంలో ఎటువంటి జ్ఞానమూ లేదు. వీరు కేవలం ఊహల ఆధారంగా ఈ మాటలు పలుకుతున్నారు.[34]

33. ఈ ఆయత్ పూర్వాపరాలను పరిశీలిస్తే ఒక విషయం దానంతట అదే విశదమయిపోతుంది. పరలోకాన్ని నిరాకరించేవారు వాస్తవానికి మనోకాంక్షల దాస్యం చేయగోరే వ్యక్తులే, వీరే పరలోక విశ్వాసం తమ ఈ స్వేచ్ఛా విహారానికి అవాంతరంగా భావిస్తారు. వారు పరలోకాన్ని తిరస్కరించిన తరువాత వారి కాంక్షాదాస్యం మరింతగా పెరిగిపోతుంది, వారు తమ మార్గవిహీనతలో అనుదినం దారి తప్పుతూ బహుదూరాలకే వెళ్ళిపోతారు, వారు పాల్పడని చెడుగు అంటూ ఏదీ మిగులదు. ఎవరి హక్కును కొల్లగొట్టడానికయినా వారు వెనుకాడరు. వారి హృదయాలలో ధర్మం న్యాయాల పట్ల ఏదో గౌరవ భావం ఉంది కాబట్టి ఏదయినా అన్యాయం, అత్యాచారం చేసే అవకాశం దొరికినా, దానికి ఒడిగట్టకుండా ఉంటారేమోనని వారి విషయంలో ఏమాత్రం ఆశించలేము. మనిషిని చూసి గుణపాఠం గ్రహించే ఎన్నో సంఘటనలు వారి దృష్టిలోకీ వస్తాయి. కాని వాటి ద్వారా వారు తద్భిన్నంగానే ఫలితాన్ని గ్రహిస్తారు. తాము చేస్తున్నదేదో సవ్యంగానే చేస్తున్నామని, తాము అలాగే చేయాలని నిర్ణయించుకుంటారు. ఎటువంటి సుబోధ వచనమూ వారికి ఉపకరించదు. ఒక మనిషిని చెడు నుండి వారించడానికి ఉపయోగపడే ఏ నిదర్శనమూ ఏ ఆధారమూ వారి ఆంతర్యానికి నప్పదు. వారు బాగా అన్వేషించి తమ ఈ నిర్నిబంధ స్వేచ్ఛా విహారానికి అనుకూలమయిన నిదర్శనాలు, ఆధారాలే వెదికి తీస్తారు. వారి మనోమస్తిష్కాలు ఏదయినా ఉత్తమ ఆలోచనలకు బదులు, తమ స్వార్థాలు, మనోకాంక్షల్ని అన్ని విధాలా పూర్తి చేసుకునేందుకే ఎత్తులకు పైఎత్తులు వేయడంలోనే రేయింబవళ్ళు నిమగ్నమయి ఉంటాయి. పరలోక విశ్వాసాన్ని తిరస్కరించడం మానవ నైతికతకు వినాశకరమనడానికి ఇదంతా ప్రస్ఫుటమయిన నిరూపణ. మానవుణ్ణి మానవీయ పరిధిలో ఏదయినా నిలబెట్టగలదంటే అది కేవలం ఒక స్పృహ–తాము బాధ్యతారహితులము కాము, దైవం సమక్షంలో తమ ఆచరణలకు సమాధానం చెప్పుకోవలసి ఉంది అన్న స్పృహ మాత్రమే. ఈ స్పృహ లుప్తమయిపోయిన వ్యక్తి ఎవరయినాసరే, మహా గొప్ప విద్వాంసుడే అయినప్పటికీ, అతను పశువులకన్నా హేయమయిన వైఖరికి పాల్పడకుండా ఉండలేడు.

34. అంటే, ఈ జీవితం తరువాత మానవునికి మరో జీవితం ఏదీ లేదని పరిశోధన తరువాత తెలిసిపోయిందనడానికి జ్ఞాన మార్గమేదీ లేదు. ఇంకా మానవుని ఆత్మ ఏ దైవం ఆజ్ఞానుసారం గానూ స్వాధీనపరచుకోబడదు, మనిషి కేవలం కాలభ్రమణం చేత మరణించి సర్వ నాశనమయిపోతాడు అన్న విషయమూ వారికి తెలిసిపోయిందనడానికి ఆధారమేదీ లేదు. పరలోక తిరస్కారులు ఇటువంటి మాటలు ఏదో జ్ఞానం మూలంగా కాదు, కేవలం అనుమానం ఆధారంగానే పలుకుతారు. శాస్త్రీయ రీతిలో వారు ఏదయినా చెప్పగలిగితే, మహా అయితే, "మరణానంతరం ఏదయినా జీవితం ఉందో లేదో మేమెరుగము" అని మాత్రమే అనగలరు. అంతేగాని, "మరణానంతరం మరో జీవితం లేనేలేదని మాకు తెలుసు" అని మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ చెప్పలేరు. అదే విధంగా మానవుని ఆత్మ దైవాదేశం ప్రకారం తీయబడదని, కేవలం ఒక గడియారం నడుస్తూ నడుస్తూ ఎలా ఆగిపోతుందో అలాగే మనిషి చనిపోయి అంతమయి పోతాడని కూడా తమకు శాస్త్రీయంగా తెలుసునని వారు వాదించలేరు. అత్యధికంగా వారు చెప్పగలిగేది కేవలం, ఈ రెండు విషయాలలో అసలు ఏ పరిస్థితులు ఎదురవుతాయో మేము చెప్పలేము అని మాత్రమే చెప్పగలరు. ఇక ప్రశ్న ఏమిటంటే, మానవుని జ్ఞానసాధనాల ప్రకారం మరణానంతర జీవితం సంభవమయినా సంభవం కాకపోవడమయినా, అలాగే ఆత్మ స్వాధీనపరచుకోవడమయినా, లేదా కాలభ్రమణం చేత మనిషి తనంతట తాను మరణించడమయినా రెండూ సంభవించే అవకాశాలు సమానంగా ఉన్నప్పుడు వీరు పరలోక జీవితం సాధ్యమయ్యే అవకాశాన్ని కాదని, పరలోక తిరస్కారాన్నే అంతిమ నిర్ణయంగా భావించడానికి కారణమేమిటి? వాస్తవానికి వీరు సమస్యను ఆధారాలతో కాక తమ ఇచ్ఛానుసారంగా నిర్ణయించడం తప్ప మరో కారణమేమీ లేదు. మరణమంటే పూర్తిగా నమసిపోవడమో లేదా 'లేమి'గా మారిపోవడమో తప్ప దైవం తరఫున ఆత్మ స్వాధీనపరచుకోవడాన్ని, మరణానంతరం మరో జీవితం ఉండటాన్నీ వారి హృదయం ఇష్టపడదు. కాబట్టి వారు తమ హృదయ వాంఛను తమ నమ్మకంగా మలచుకుంటారు. ఆపైన మరే మాటనయినా నిరాకరిస్తారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

## యమనీల విశిష్టత

**249)** అబూ హురైరా(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించారు: "మీ వద్దకు యమనీలు వచ్చారు. వారు మృదు మనస్కులు. వారి హృదయాలపై ఉన్న పొర పలుచనిది. ధర్మావగాహన యమనీలలో ఉంది. విజ్ఞత, వివేచన కూడా యమన్‌దే."[1]

**250)** అల్ఖమా ఇలా వివరించారు: మేము అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) దగ్గర కూర్చుని ఉండగా సుప్రసిద్ధ సహాబీ మహనీయ ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) అక్కడికి విచ్చేశారు. "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! మీ దగ్గర కూర్చుని ఉన్న ఈ నవయువకులు (మీ శిష్యులు) మీ మాదిరిగానే ఖుర్‌ఆన్ పారాయణం చేస్తారా?" అని అడిగారు. దానికి ఇబ్నె మస్‌ఊద్(రజి), "మీరు కోరినట్లయితే పారా యణం చెయ్యమని ఎవరితోనయినా చెప్పనా?" అన్నారు. "తప్పకుండా" అన్నారు ఖబ్బాబ్. అప్పుడు ఇబ్నె మస్‌ఊద్, "అల్ఖమా! నీవు పారాయణం చెయ్యి" అని పురమాయించారు. అప్పుడు జియాద్ బిన్ హుదైర్ సోదరుడైన జైద్ బిన్ హుదైర్ 'తమరు ఖుర్‌ఆన్ పారాయణం కొరకు అల్ఖమాను ఆదేశిస్తున్నారా! వాస్తవానికి అతను మాలాగా చక్కగా పారాయణం చెయ్యలేడు కదా!' అని సందేహం వ్యక్తం చేశారు. దానికి ఇబ్నె మస్‌ఊద్(రజి) 'ఓహో! అదా నీ సందేహం. నీవు కోరితే దైవప్రవక్త (స) నీ జాతి వారి గురించి వినిపించిన హదీసును వినిపిస్తాను' అని అన్నారు.

అల్ఖమా ఇలా అన్నారు: "నేను మర్యమ్ సూరాలోని యాభై ఆయత్‌లను పారాయణం చేసి వినిపిం చాను. తరువాత ఇబ్నె మస్‌ఊద్(రజి), ఎలా పఠించాడు? అని అడగ్గా, "చాలా బాగా పఠించాడ"ని ఖబ్బాబ్(రజి) చెప్పారు. ఇబ్నె మస్‌ఊద్(రజి) ఇలా అన్నారు: "నేను ఏ ఆయత్‌ను ఎలా పఠిస్తే, అల్ఖమా కూడా అలాగే పఠిస్తాడు". తరువాత ఆయన ఖబ్బాబ్ (రజి) వైపు ఎగాదిగా చూశారు. ఆయన చేతిలో బంగారు ఉంగరం ఉండటం గమనించి, "ఈ ఉంగరాన్ని తీసి పారవేసే సమయం ఇంకా ఆసన్నం కాలేదా?" అని అడిగారు. దానికి ఖబ్బాబ్, "ఈ రోజు తరువాత ఇక మీరు ఎన్నడూ నా చేతిలో ఈ ఉంగరం చూడరు" అంటూ ఆ ఉంగరాన్ని తీసేశారు.[1] ఈ హదీసును గుందర్ షూబా నుండి ఉటంకించారు.

249-1 ఈ హదీసు ద్వారా యమన్ ప్రజల ప్రాధాన్యత ద్యోతకం అవుతోంది. హదీసు విద్య పట్ల యమన్ వాసులలో గల శ్రద్ధాసక్తులు వేరితర దేశాల్లో లేదు. హృదయాల పొర పలుచగా ఉండటం అన్న మాటలోని ఆంతర్యం ఏమిటంటే, వారు సత్యాన్ని తొందరగా స్వీకరిస్తారు. ఇది విశ్వాసానికి (ఈమాన్‌కు) తార్కాణం.

250-1. జైద్ బిన్ హుదైర్ బనూ అసద్ తెగవారు. అల్ఖమా నఖ్ఆ తెగకు చెందినవారు. దైవప్రవక్త(స) నఖ్ఆ తెగవారి కోసం ప్రార్థించేవారు.

బహుశా ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) పురుషులు బంగారు ఉంగరం తొడుక్కోవడాన్ని 'అవాంఛనీయం' (మక్రూహ్)గా మాత్రమే భావించేవారేమో. కాని అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజి) హెచ్చరించిన పిదప, అది పురుషులకు నిషిద్ధం అని తెలుసుకుని ఆ ఉంగరాన్ని తీసివేశారు.

# ఈజిప్టు పరిస్థితులు, టర్కీ అనుభవాలు - గుణపాఠాలు



మూడవ భాగము

అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుంచి....)**

**(గత సంచిక తరువాయి)**

ఈ విషయంలో కూడా టర్కీ మనకు భిన్నంగా, ఆదర్శవంతంగా ఉంది. అర్బకాన్ గారి పార్టీ ప్రజలందరి పార్టీగా పని చేసింది. ఉర్దగాన్ ఈ భావనను మరింత అభివృద్ధిపర్చి ముందడుగువేశారు. తన పార్టీని మొత్తం సమాజానికి ప్రతినిధిగా మలిచారు. ప్రతిభలకు, నైపుణ్యాలకు పట్టం కట్టారు. నిర్మాణానికి రెండవ ప్రాముఖ్యతనిచ్చారు. అహ్మద్ దావూద్ ఉగ్లూ, ముహమ్మద్ గౌర్‌మౌజ్ లాంటి మేధావులను, ప్రొఫెసర్లనూ, బఖీర్ బోజ్‌దాగ్ లాంటి ధార్మిక పండితులను, నిహయత్ ఉర్గూన్ లాంటి వాణిజ్యవేత్తలను, పారిశ్రామికవేత్తలనూ, తన పార్టీలో ప్రధానమైన స్థానాలలో నిలిపారు. ప్రభుత్వాధికారంలోనూ వీరికి ప్రాముఖ్యతనివ్వబడింది. ఉర్దగాన్ గారి పదేళ్ళ పదవీ కాలంలో టర్కీ ఆర్థిక స్థితి ఉన్నత శిఖరాలకు చేరుకుంది. దీనిని ప్రపంచం Economical Miracle గా పిలిచింది. ఈ అద్భుత సాధన కోసం ఉర్దగాన్ ఉద్యమంతో సంబంధం లేని ఒక 33 ఏళ్ళ యువకుడికి ఆర్థిక నాయకత్వపు బాధ్యతలు అప్పజెప్పారు. టర్కీ ఆర్థిక మంత్రిగా ఈ అలీబాబాజాన్ అనే యువకుడు నియమింపబడి నేడు 54 ఏళ్ళ వయసుతో ఉపప్రధానిగా పని చేస్తున్నాడు. తన నైపుణ్యం, మేధావితనంతో ఈ ఆర్థిక మంత్రి అంచనాలకు మించిన ప్రతిఫలాన్ని దేశానికి అందిస్తున్నాడు. యూరప్‌తో సంబంధాలు టర్కీకి ఎల్లప్పుడూ కత్తిమీద సాములాంటిదిగానే ఉండింది. ఈ విదేశీ వ్యవహారాల కోసం కూడా ఉర్దగాన్ 39 ఏండ్ల అగ్‌మన్ బాగస్‌ను నియమించారు. ఈయన రచించిన విదేశీ పాలసీలు ప్రణాళికల ఫలితంగా ఉర్దగాన్ పార్టీ ప్రజలమధ్య బలమైన రాజకీయ శక్తిగా నిలిచింది. ఒక వర్గానికో, ఒక విశ్వాసానికో లేక దృక్పథానికో కట్టుబడక పూర్తి సమాజానికి బాధ్యత వహించే రాజకీయ పార్టీగా, ప్రజా ప్రభుత్వంగా ప్రజలమధ్య నమ్మకాన్ని సాధించింది.

ఇది కూడా నేడు ఉద్యమానికి ఒక గుణపాఠం కావాలి. ముస్లిం సమాజంలో విభిన్న వేదికలు, ఫోరంలు, మనం స్థాపిస్తాం. ముస్లిం సముదాయంలోని నైపుణ్యం ప్రతిభలు గల వారికి విశాల హృదయం, దూరదృష్టితో ప్రాధాన్యతలు కల్పించిన మన గత నాయకుల దూరదృష్టి, మనకు సముచితంగానే కనపడుతుంది. మన ఈ ఆచరణ మనల్ని ఒక ఉద్యమంగా కాక, ఒక వర్గం (ఫిర్ఖా)గా మార్చివేస్తుంది. ఇక మనం కూడా సమాజంలోని అనేక వర్గాలలో ఒక వర్గంగా నిలిచిపోతాం. ఆపై మొత్తం సమాజపు నమ్మకం, అభిమానం పొందడం అసాధ్యమైపోతుంది.

## ఇస్లాం అభిమానుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం

11 సెప్టెంబర్ సంఘటనల తర్వాత ఫరీద్ జకరియ్యా న్యూస్ వీక్‌లో ఒక వ్యాసం రాశారు. అందులో తీవ్రవాదానికి వ్యతిరేకంగా అమెరికా ప్రభుత్వం చేస్తున్న ఆచరణాత్మక ప్రయత్నాలను సమీక్షించడం జరిగింది. అందులో ఆయన అమెరికా ప్రభుత్వానికి సాంస్కృతిక ఆచరణ గురించి సలహా ఇచ్చాడు. అంటే ఇస్లామీయ ఉద్యమాలను కించపరుస్తూ, చేస్తూ విశేషంగా ప్రచార ప్రాపగండాలు చేయాలని సూచించాడు. ఇంకా గతంలో ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో కమ్యూనిజానికి వ్యతిరేకంగా చేసిన బద్‌నామ్ ప్రాపగండా లాంటిదే ఇప్పుడు ఇస్లాంకు వ్యతిరేకంగా చేయాలని సలహా ఇచ్చాడు (Fareed Zakaria ; Politics of Rage in Newsweck - 14.10.2001 / at Politics - rage - why - do - they - hate - us - 154345 ; retrievedon - 30.11.2016)

ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం చూస్తే జకరియా సలహా పాటించబడుతూ వున్నట్లు అర్థమవుతుంది. ఇస్లాం అభిమానులను బద్‌నామ్ చేసే ప్రాపగండా ఇప్పుడు తీవ్రస్థాయిలో జరుగుతుంది. ఇస్లామీయ వ్యక్తిత్వాలను కించపర్చడం, వారిని అవమానపర్చడం ఇప్పుడు నిత్యకృత్యమయ్యింది. ఈ ప్రాపగండా ఉద్యమానికి కొన్ని లక్ష్యాలు ఉన్నట్లు తెలుస్తోంది. వారి ప్రాపగండా క్రింది విధంగా ఉంటుంది.

1. ఇస్లాం అభిమానులు తీవ్రవాదులుగా ఉంటారు. లేదా తీవ్రవాదులకు సహాయకులుగా ఉంటారు.

2. వీరు కేవలం తమ సంస్థలను మాత్రమే సమర్థిస్తారు. సాధారణ సమాజంతో ప్రజలతో వీరికి అవసరం ఉండదు. వీరు పట్టించుకోరు.

3. వీరు మంచి ఉపన్యాసకులు అయివుంటారు తప్ప వీరికి పరిపాలన చేసే సామర్థ్యం ఉండదు. వీరికి పరిపాలించడం చేతకాదు లేక అసమర్థులు. వీరి నాయకత్వంలో దేశం అభివృద్ధి సాధించదు.

4. వీరు, స్త్రీలను, ముస్లిమేతరులను చాలా నీచంగా చూస్తారు. వీరి అధికారంలో ఈ రెండు వర్గాలు (స్త్రీలు, ముస్లిమేతరులు) సురక్షితంగా ఉండలేరు.

5. తమదేశం కంటే అంతర్జాతీయ అంశాలపైనే వీరు ఎక్కువ శ్రద్ధ చూపుతారు. వీరు దేశ ప్రేమికులుగా ఉండరు. వీరి నాయకత్వంలో దేశప్రయోజనాలు నెరవేరవు సరికదా దెబ్బతింటాయి.

6. వీరు అంతర్జాతీయ ఆధిపత్య శక్తులకు వ్యతిరేకులుగా ఉంటారు. కనుక ఆ అంతర్జాతీయ శక్తుల ఆగ్రహానికి, నిషేధాలకు గురౌతారు. ఇది దేశానికి నష్టదాయకమవుతుంది.

7. ఈ ప్రచార బాణాలన్ని నిరర్థకమై నేలకూలినప్పుడు ఇస్లామీయ నాయకత్వంపై అవినీతి (Corruption), కుటుంబ, వర్గ పక్షపాతం, దోపిడి, దౌర్జన్యం లాంటి ఆధార రహిత అభాండాలను, నిందలను, అబద్ధాలను నిరంతరం ప్రచారంలో పెడతారు. ప్రజలు వీరి అబద్ధాలను నమ్మి వీరికి వ్యతిరేకులుగా మారాలని, నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటారు.

ఈజిప్టు, ట్యునీషియా నుండి బంగ్లాదేశ్ వరకు ఇస్లామీయ ఉద్యమాలు, వారి నాయకత్వాలు, ఈ విమర్శల గుండా పయనించవలసి వచ్చింది. ఈ ప్రచారాలు పూర్తిగా అబద్దాలుగా తేలాయి. కొన్ని వదంతులు గోరంతలు కొండంతలుగా చేసి ప్రచారం చేయబడ్డాయి. ఉద్యమాల లక్ష్యాలను, ధ్యేయాలను వక్రీకరించి చేసినవిగానూ వున్నాయి.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? మనవైపు నుండి అధ్యయన పరిశోధనా సంస్థలు స్థాపించబడాలి. వాటి రిపోర్టులను ప్రతి నిత్యం సోషల్ మీడియా, ట్విటర్, ఫేస్‌బుక్ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. శత్రువు అబద్ధ ప్రాపగండాను శక్తివంతంగా, ప్రణాళికాబద్ధంగా, నిర్మాణాత్మకంగా ఎదుర్కోవాలి. వారి అబద్ధాల ముసుగులను ప్రజల ముందు చించిపడేయాలి. సత్యాలను స్పష్టంగా ప్రజలకు అర్థమయ్యేలా సమాజం ముందు ఉంచాలి. అదే సమయంలో ఉద్యమాల నాయకత్వం తమ జీవితాలను పరిశుభ్రంగా, పారదర్శకంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలి. ఎటువంటి తప్పుడు భావనలకు, అవకాశం ఇవ్వని విధంగా మన ఆచరణ ఉండాలి. మన మాటలు తూచినట్లుగా, లోతైన భావం ఉండేలా గంభీరంగా ఉండాలి. శత్రువులకు విమర్శ చేసే అవకాశం ఉండని విధంగా మన మాట, చేత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మనం మనదేశం, సమాజాల సమస్యలను అడ్రస్ చేయాలి. వాటికి సహేతుక పరిష్కారాలు సూచించాలి. అందుకు ఆచరణాత్మక కృషి చేయాలి. ప్రజలను ఉద్రేకపర్చే విధానాలను మానాలి. ప్రజలను ఆలోచనాపరులుగా తీర్చిదిద్దాలి. అప్పుడు శత్రువు చేసే ప్రాపగండా, దుష్ప్రచారాలు, అబద్ధాలు తమకు తాముగా ఓడిపోక తప్పదు.

❖ ❖ ❖

# నల్లజాతి సూరీడు హజ్రత్ బిలాల్ (రజిఅన్)

- కవి కరీముల్లా

**అది అరేబియా గడ్డ.** మండే ఎండలకు, పాషాణ హృదయాలకు అడ్డా. ఎటుచూసినా ఖురైష్ సర్దారుల దాష్టీకాలకు, అగ్రవర్ణ అహంకారం తలకెక్కిన అరబ్బుల ఆగడాలకు అంతే లేని కాలం.. నల్లజాతి వారిని బానిసలుగా నడిబజారులో నిలబెట్టి వేలం వేసి పశువులను కొన్నట్టు కొని ఇంత తిండి పెట్టి జీవితాంతం ఊడిగం చేయించుకుని వృద్ధాప్యం వచ్చాక వదిలేసే దుష్ట కాలం. అరబ్బుల ముందు నల్లజాతి నీగ్రోలు అణగిమణగి ఉండాలి. తల ఎత్తి మాట్లాడకూడదు. కనీసం చెప్పులు వేసుకుని నడవకూడదు. నడుముకు తప్ప శరీరంపై దుస్తులు ధరించరాదు. నల్లజాతి వారి కష్టాలకు, కన్నీళ్లకు అంతే లేదు.

సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఓ అనురాగ రావం, ఓ విప్లవవాణి వినిపించింది. ఆయనే దైవ ప్రవక్త ముహమ్మద్ (స). ఆయన సందేశం ఏమంటే మానవులంతా ఒక్కటే. మానవులందరి దైవం ఒక్కడే. మనుషులంతా పుట్టుక రీత్యా అందరూ సమానులే. ఎవరూ అధికులు కారు. ఎవరూ అల్పులూ కారు. నల్లజాతి వారు బానిసలు కారు. వారు అరబ్బులకు సమానులు అనే ప్రవక్త మాట ఖురైష్ సర్దారులకు కంటగింపైంది.. ఎవరైనా ప్రవక్తను అనుసరిస్తే దారుణంగా శిక్షించేవారు. అటువంటి క్లిష్ట సమయంలో నేను ప్రవక్తను అనుసరిస్తాను అని ఒక నల్లజాతి సూరీడు మక్కాలో ముందుకు వచ్చాడు. ఆయనే హజ్రత్ బిలాల్ (రజిఅన్).

ఇథియోపియా నుండి కొనుగోలుపై వచ్చిన నీగ్రో బానిస రబాహ్, హమామా దంపతులకు తొలి చూరు బిడ్డడు బిలాల్. బాల్యం నుండే మంచి దేహదారుఢ్యంతో నేరేడు పండు రంగులో నిగనిగ లాడేవారు. అగ్రవర్ణ అహంకారి ఉమయ్యా వద్ద బానిసగా ఉండేవారు. ప్రవక్త ముహమ్మద్(స) ఇచ్చిన ఏకేశ్వరోపాసన, సామాజిక సమానత్వ పిలుపు బిలాల్ ఆలోచనలు మార్చాయి. అవును! మనిషి సాటి మనిషికి ఎందుకు దాస్యం చేయాలి. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భావన ఏమిటి? అనే ఆలోచనలో ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. అలా బాధ పడి మౌనంగా ఉంటే చరిత్ర బిలాల్‌ను పట్టించుకునేది కాదు. కలిమా చదివి ప్రవక్తను అనుసరించాలని నిర్ణయించుకున్నారు. కలిమా చదివి అగ్రవర్ణ బానిసత్వం నుండి విముక్తి పొందిన అమ్మార్‌ను ఖురైష్ సర్దారులు బంధించారు. అహంకారి ఉమయ్య "ఏయ్ బిలాల్! అమ్మార్‌ను కొరడాతో కొట్టు" అని ఆదేశించాడు. ఒక బానిసను మరో బానిసతో కొట్టిస్తానని హూంకరించాడు. బిలాల్ కళ్లు చింత నిప్పులయ్యాయి. అమ్మార్‌ను కొట్టేదే లేదు. నేనూ కలిమా చదువు తున్నాను. "అష్‌హదు అల్లాఇలాహ ఇల్లల్లాహు వఅష్‌హదుఅన్న ముహమ్మదర్రసూలుల్లాహ్" అని బిగ్గరగా పలికాడు. అంతే.. ఖురైషు సర్దారుల కోపం కట్టలు తెంచుకుంది. ముహమ్మద్ ప్రారంభించిన ఈ ఉద్యమం బానిసల్లోను, దళితుల్లోనూ

పాకుతోంది. ఇక సహించేదిలేదని కేకలు వేసుకుంటూ బిలాల్‌ను బంధించారు. మండుటెడారిలో నడుముకు ఉన్న గుడ్డ తప్ప మరేమీ లేని బిలాల్‌ను పరుండబెట్టి బరువైన బండరాయిని ఛాతీపై ఉంచారు. బండ వేడికి చర్మం కాలి కమురు వాసన వస్తుంది.. “ఏయ్ బిలాల్ ఇప్పటికైనా ప్రవక్త బాటను వీడుతావా! లేదా?” అని గద్దించారు. ఎన్ని హింసలు పెట్టినా కలిమా చదువుతూ స్పృహ తప్పేవారు. మెడకు తాడు కట్టి లాగేవారు. అయినా బిలాల్ విశ్వాసంపై స్థిరంగా నిలబడ్డారు. విషయం తెల్సుకున్న ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అబూబకర్ సిద్దీఖ్ (రజిఅన్)ను పిలిచి బిలాల్‌ను అతని యజమానికి రొక్కం చెల్లించి బానిసత్వం నుండి విముక్తి కలిగించి తీసుకురమ్మని పంపించారు. అలా విముక్తి పొందిన బిలాల్ నిత్యం ప్రవక్త ప్రారంభించిన విముక్తి ఉద్యమంలో ప్రథమంగా నిలబడ్డారు.

ఇస్లామీయ చరిత్రలో తొలి అజాన్ పలికిన ముఅజ్జిన్‌గా నియమితులయ్యారు. మక్కా విజయం సందర్భంగా పవిత్ర కాబా గోడపై ఎక్కి ప్రవక్త కోరిక మేరకు తొలి అజాన్ ఇచ్చారు. ఈ గౌరవం బిలాల్‌కు దక్కటం కొంతమంది అగ్రవర్ణ మనస్తత్వం ఉన్న అరబ్బులకు నచ్చలేదు. గుసగుసలు ప్రారంభమయ్యాయి. “ఏమిటీ నిన్నటి వరకూ అరబ్బుల బానిసగా ఉన్న వ్యక్తికి ఇంత గౌరవమా!” అని గొణుక్కోసాగారు. ప్రవక్త ఇది గమనించి చూడండి వంశాలు, గోత్రాలు, వర్ణాల అహంకారాలన్నీ నా పాదాల కింద తొక్కేశాను. అని మందలించారు... అందరూ పశ్చాత్తాపంతో కన్నీరు కార్చారు.. హజ్రత్ ఉమర్ అంతటి వారు బిలాల్‌ను “ఓ మా సర్దార్!” అని అనేవారు.

బిలాల్ విముక్తి మొత్తం నల్లజాతికి ఆదర్శంగా నిలిచింది. ప్రవక్త వెంట నల్లజాతి వారు నడవటానికి స్ఫూర్తి ఇచ్చింది. అలా తన జీవితమంతా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రారంభించిన విముక్తి ఉద్యమంలో నడిచారు. ప్రవక్త పరమపదించాక శోకతప్తులై తొలి ఖలీఫా అబూబక్ర్ వద్ద సెలవు తీసుకొని సిరియాకు వలసపోయారు. ఇస్లామ్‌కు పూర్వం అసమానతలకు ఆలవాలమైన అరేబియాలో ఇస్లామ్ తరువాత ఈ నల్లజాతి దళితుని వివాహ బంధంలోకి కులీన అరబ్బు మహిళలు రావటం గమనార్హమైన విషయం.

ఒకసారి మహనీయ బిలాల్(రజి) సిరియాలో ఉండగా దైవప్రవక్త ముహమ్మద్(స) కలలో కనిపించారు. అంతే, ఆయన హుటాహుటిన మదీనాకు పయనమయ్యారు. దైవప్రవక్త మనవడి కోరికపై ‘మస్జిదె నబవీ’లో అజాన్ ఇచ్చారు. ఆ పిలుపునకు మదీనాలోని అణువణువూ పులకించింది. మదీనావాసులు తండోపతండాలుగా మస్జిద్ వైపునకు పరుగెత్తుకుని రాసాగారు. అజాన్ ఇస్తూ, ‘అష్‌హదుఅన్న ముహమ్మదర్రసూలుల్లాహ్’ అనే పలుకు దగ్గరకు వచ్చేసరికి హజ్రత్ బిలాల్(రజి) తట్టుకోలేక విలవిల్లాడిపోయారు.

సిరియాలోని డెమాస్కస్‌లో జీవితాంతం ఇస్లామ్ ప్రేమగీతాన్ని వినిపిస్తూ అక్కడే కన్నుమూశారు.

*- రజిఅల్లాహు అన్‌హు వ రజూఅన్-*


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని ‘Geeturai Weekly’ పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# నవ్వు... నలభై విధాల గ్రేటు ఆరోగ్యానికి రూటు



**- పోలంకి విజయభాస్కర్**

**నవ్వు ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం... నవ్వలేక పోవడం రోగం... అన్నారు మన పెద్దలు.** నవ్వులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి. ఇంటర్నెట్‌లోనో, మొబైల్ ఫోన్‌లోనో జోక్స్ చెప్పుకోవడం అందరికీ ఉత్సాహం కలిగిస్తుంది. కార్టూన్లు, హాస్యకథలు చదవడం, టీవీలో కామెడీ బిట్లు చూడడం మొదలైనవి మానసిక ఒత్తిడిని తగ్గించడానికి తోడ్పడతాయి. చిన్న పిల్లలతో సంభాషణ వల్ల కూడా మానసికోల్లాసం కలుగుతుంది. మనస్ఫూర్తిగా  నవ్వే నవ్వు నలుగురి మధ్య ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. నవ్వు వల్ల మనుషుల మధ్య ఉండే మనస్పర్థలు తొలగిపోతాయి. దానివల్ల పలువురి మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుంది. ఒకనాటి మాట "నవ్వు నాలుగు విధాలుగా చేటు... వివాదానికి చోటు" ఈనాటి మాట... "నవ్వు నలభై విధాలా గ్రేటు, ఆరోగ్యానికి రూటు" అంటున్నారు ఆరోగ్య నిపుణులు. నవ్వడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని నిపుణుల అభిప్రాయం.

ఉరుకులు పరుగుల  జీవితంలో నవ్వు అనేది నేడు అడ్రస్ లేకుండాపోయింది. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లైక్‌లలో ఎమోజిగా మాత్రమే నవ్వు కనిపిస్తున్నది. నిజ జీవితంలో నవ్వు కనుమరుగైపోతున్నది. మన జీవనశైలిలో యంత్రాలు భాగమైనట్లే మన వ్యక్తిత్వంలో కూడా అనునిత్యం యాంత్రికత భాగమై పోయింది. రోజుకు కనీసం నాలుగైదు సార్లయినా నవ్వుతున్నామా అనేది ఆలోచించాల్సిన విషయం.

1950లలో రోజూ కనీసం 20 నిమిషాలకు పైగా నవ్వేవారట. ఇప్పుడు కనీసం  రెండు మూడు నిమిషాలు నవ్వడం కూడా గగనమైపోయింది. నవ్వు అనేక రోగాలను దూరం చేసే మంచి టానిక్. దీనికి మించిన వ్యాయామం  లేదనే  చెప్పవచ్చు. శారీరకంగానూ, మానసికంగానూ ఎంతో ఆరోగ్యాన్నిచ్చి, ఉత్సాహంగా- ఉల్లాసంగా ఉండేలా చేసేది నవ్వు. నిజానికి ఇది ఒక గొప్ప ఔషధ పువ్వు. ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరికైనా ఇది ఇచ్చే ఫలితం మాత్రం మారదు. నవ్వు శరీరంలోని కోటికోల్ అయాన్ హార్మన్లను విడుదల చేస్తుంది.

నవ్వు వల్ల ఎండార్ఫిన్ అనే హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. ఇవన్నీ బాధను  మరిపిస్తాయి. అనేక శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేసి ప్రశాంతతను ఇవ్వడంలో ఈ హార్మోన్లు ప్రధాన పాత్రను పోషిస్తాయి. ప్రతి మనిషి ఎక్కడ పుట్టినా, మరెక్కడ పెరిగినా అర్థమయ్యే భాష నవ్వు. నవ్వడం మనం నేర్చుకోనక్కర

లేని భాష. పుట్టుక నుండే మనకు నవ్వు వస్తుంది. నవ్వు మనకు తెలియకుండానే వస్తుంది. వచ్చిన నవ్వును బలవంతంగా మనం ఆపగలమే కానీ బలవంతంగా నవ్వలేం. నవ్వడం వలన శరీరంలో ఉన్న రోగాలన్నీ మటుమాయమవుతాయని ఆరోగ్య నిపుణులు తెలిపారు. నవ్వడం మూలాన జీవితంలో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చని పేర్కొన్నారు. నవ్వు గురించిన నమ్మలేని నిజాలివి. నవ్వకండి... నమ్మండి. ఆరోగ్యం కోసం ఎన్నో తిప్పలు పడుతున్నాం. చక్కని ఆహారం తింటున్నాం, పండ్లు కొంటున్నాం, జిమ్ చేస్తున్నాం. కానీ నవ్వడం మరచి పోతున్నాం. నవ్వడానికి కష్టపడాల్సిన పని లేదు. పైగా అవన్నీ కొనాలి. నవ్వు మాత్రం కొనక్కర్లేదు. అందుకే నవ్వు గురించి ఈ నమ్మలేని నిజాలు తెలుసుకుని నవ్వకండి... నమ్మండి.

నవ్వుతూ తుళ్లుతూ ఉండే ఉద్యోగుల వల్ల 20 శాతంపైగా ఉత్పాదకత పెరుగుతుందని పలు అధ్యయనాలు తెలిపాయి. మార్కెటింగ్ విభాగంలో సిబ్బంది చిరునవ్వుతో అమ్మకాలు చేస్తే ఏకంగా 37 శాతం అమ్మకాలు పెరుగుతాయని నిపుణుల నమ్మకం. నవ్వుతూ సంతోషంగా ఉన్నవారు పనులన్నీ సకాలంలో సమర్థవంతంగా చేయగలుగుతారు. ఇలాంటి వారి జీవితంలో మధురానుభూతులు కూడా ఎక్కువగానే ఉంటాయి. కుటుంబ సభ్యులతో సమాజంలోని తోటి మనుషులతో ఆప్యాయంగా నవ్వుతూ మాట్లాడే ప్రయత్నం చేస్తే మానసిక శారీరక ఆరోగ్యం బాగుంటుందని ప్రకృతి చికిత్స నిపుణులు అంటుంటారు. ఎదుటి వారు మనస్ఫూర్తిగా నవ్వుతున్నారా.. కావాలని బలవంతంగా నవ్వుతున్నారా అనేది మనకు తెలిసిపోతుంది. ఎలాగంటే ఆ విషయాన్ని మన మెదడు ఇట్టే పట్టేస్తుంది. ఆ మెకానిజం దానికి ఉంది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే అమ్మాయిలు అబ్బాయిలకు అందంగా కనిపిస్తారట. నవ్వుతూ ముచ్చట్లు చెప్పేవారికి ఫ్రెండ్స్ కూడా ఎక్కువే. అలాంటి ఉద్యోగులపైనా పై అధికారులకు సదభిప్రాయం ఉంటుందట.

చిన్నపిల్లలు రోజుకు సగటున 300 సార్లు నవ్వుతారట. పెద్దయ్యేసరికి అది కాస్తా 13కి తగ్గిపోతుందట. శరీరంలో కార్టిసోల్ ఉత్పత్తిని అదుపులో ఉంచి, ఒత్తిడిని తగ్గించడానికి నవ్వు తోడ్పడుతుంది. బాగా నవ్వడం వల్ల పొట్ట కూడా తగ్గుతుంది. పదిహేను నిమిషాల పాటు నవ్వితే శరీరంలో 40 క్యాలరీలు కరుగుతాయి. నవ్వేటప్పుడు మెదడు ఆనందాన్నిచ్చే ఎండార్ఫిన్లను విడుదల చేస్తుంది. మనసారా నవ్వే నవ్వు హృదయసంబంధ వ్యాధుల్ని దరిచేరనివ్వదు. నవ్వు కాస్త జ్ఞాపకశక్తిని పెంచుతుందని, కామెడి సినిమాలు ఎక్కువ చూసే వారిలో ఇది ఉన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. నవ్వు రక్తంలోని చక్కెర స్థాయిల్ని అదుపులో ఉంచుతుంది. బాగా నవ్వే వాళ్ళల్లో నిద్రలేమి సమస్యలు కూడా తక్కువే. గట్టిగా నవ్వడం వల్ల మన ముఖం, పొట్టలోని కండరాలు బలపడతాయి. రోజూ ఉదయాన్నే లేవగానే కాసేపు నవ్వితే కాఫీ తాగినంత ఉత్సాహం వస్తుంది. అంతే కాకుండా ఆయుష్షు కూడా పెరుగుతుంది.

**రచయితలు తమ రచనల ద్వారా వ్యక్తపరిచే అభిప్రాయాలన్నింటితో గీటురాయి ఏకీభవించనవసరం లేదు.**

**- సంపాదక వర్గం**

## పోలీసులకు ఈదుల్ ఫితర్ కానుక

అనంతపురం : ఎండ తీవ్రత ఎక్కువైనప్పటికీ రోడ్లపై కష్టపడుతూ ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఈదుల్ ఫిత్ర్ సందర్భంగా జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు డ్యూటీలో ఉన్న పోలీస్ అధికారులకు ఖర్జూరం, వాటర్ బాటిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అసేన్, ఫారూఖ్, ఐవైఎం సిటీ ప్రెసిడెంట్ ఫిరోజ్ పాల్గొన్నారు. పోలీసుల సేవలకు కృతజ్ఞతగా, మానవతా దృక్పథంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి చంద్రశేఖర్ జమాఅత్‌కు సహకరించారు.






**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**రాత్రివేళ తహజ్జుద్ నమాజ్ కూడా చేస్తూ ఉండు. ఇది నీ కోసం అదనపు నమాజ్‌గా నిర్ణయించబడింది. నీ ప్రభువు నిన్ను త్వరలోనే అత్యున్నతమైన స్తుతిస్థానం మీద ప్రతిష్ఠింపజేయ వచ్చు. (బనీ ఇస్రాయీల్-79)**

సంఘజీవి అయిన మనిషి కొన్ని సందర్భాల్లో ఒంటరిగా ఉండటాన్ని కోరుకుంటాడు. ఇష్టంతో కోరితెచ్చుకున్న ఒంటరితనమే ఏకాంతం. ఇందులో బాధ, నిరాశానిస్పృహలు ఉండవు. ఓ ఆనందం. ఓ ఆత్మావలోకనం ఉంటాయి. పునరాలోచన, అనుభవాల విశ్లేషణ లాంటి భావనలు అంతర్వాహినులవుతాయి.

## హిరా గుహలో ప్రవక్త (స) వారి ఏకాంత ప్రార్థన - సమాజం గురించిన చింతన, ఖురాన్ అవతరణ

మహాప్రవక్త(స) గారి వయసు 40 సంవత్సరాలకు దగ్గరవుతుండగా అల్లాహ్ ఆయన కోసం ఏకాంతాన్ని ప్రియంగా చేశాడు. తరచూ ఆయన సత్తు పిండి, నీళ్ళు తీసుకుని మక్కాకు రెండు మైళ్ళ దూరాన ఉన్న నూర్ పర్వతంపై గల హిరా గుహలోకి వెళ్ళేవారు. రమజాను మాసమంతా హిరా గుహలోనే ఆరాధన, అనుశీలనల్లో, సృష్టి రహస్యాల ఛేదనలో నిమగ్నులయ్యేవారు. నిత్యం తన జాతి వారిలో తిష్ఠ వేసిన విగ్రహారాధన, మద్యపాన సేవనం, విషయ లోలత్వం లాంటి సామాజిక రుగ్మతల గురించి, వారి నైతిక దుస్థితి గురించి తీవ్రంగా మథనపడేవారు. ప్రవక్త (స) గారి ఏకాంతం కూడా అల్లాహ్ సూచనల్లోని ఒక సూచనే. దైవదౌత్యానికి మూడు సంవత్సరాల ముందు నుండే అల్లాహ్ తన ప్రవక్త (స) కోసం ఈ ఏకాంతాన్ని సమ్మతించాడు. ప్రవక్త (స) ఈ ఏకాంతంలోనే నెలలు గడిపేవారు. బ్రహ్మాండమైన ఈ విశ్వ కర్మాగారం వెనుక ఉన్న ఆ శక్తి ఏది? మానవుల ఆ నిజ స్వామిని ఆరాధించే సరైన పద్ధతి ఏమిటి? వీటిపైనే ఆయన తన మనసును కేంద్రీకరించారు.

ప్రవక్త (స) గారి ఈ ఏకాంత జీవితం, నిజానికి అల్లాహ్ ప్రణాళికలో ఓ భాగమే. ఇలా అల్లాహ్ ఆయన్ను రాబోయే మహోన్నత కార్యం కోసం సిద్ధం చేస్తున్నాడు. యథార్థం ఏమిటంటే, ఏ వ్యక్తి అయినా, మానవ జీవితపు యథార్థాలను ప్రభావితం చేసి, వాటిని ఓ రుజుమార్గం వైపునకు మళ్ళించవలసివస్తే, అతను లౌకిక ఆర్భాటాలు, జీవిత ఝంఝాటాలు, ప్రాపంచిక వ్యామోహాలకు కొంతకాలం దూరంగా ఉంటూ ఏకాంతంలో గడపవలసి ఉంటుంది.

అచ్చం ఈ సూత్రానికి అనుగుణంగా, అల్లాహ్, ముహమ్మద్ (స)కు మహోన్నత కార్యసాధనా బాధ్యతను అప్పగించి, తద్వారా ప్రపంచ సంస్కరణకు, చరిత్ర గతిని తిప్పడానికి ఎంచుకోదలి

> **“ప్రజలారా! సలాంను వ్యాపింపజేయండి. (ప్రజలకు) అన్నం తినిపించండి. ప్రజలు రాత్రి గాఢనిద్రలో ఉండే సమయంలో నమాజు చేయండి. అలాచేస్తే మీరు ప్రశాంతంగా స్వర్గంలోకి ప్రవేశించగలరు”.**
>
> **(తిర్మిజీ, హసన్, సహీహ్)**

చాడు. దైవదౌత్య బాధ్యత ఆయనపై వేయడానికి మూడేళ్ళకు ముందే ఆ ఏకాంతవాసాన్ని ఆయనపై విధించడం జరిగింది. ఏకాంతంలో అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమైపోయేవారాయన. విశ్వసృష్టి సూచనలను చూస్తూ వాటి వెనుక ఉన్న రహస్యాన్ని గూర్చి ఆలోచించేవారు. మహాప్రవక్త (స) ఈ ఏకాంతవాసంలో ఓ నెల్లాళ్ళు విశ్వ వ్యవస్థ గురించి ఆలోచిస్తూ, దాని వెనుక దాగివున్న రహస్యం గురించి ఆలోచించేవారు. దైవాదేశం వస్తే ఆ రహస్యాన్ని బయట పెట్టడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండేవారు.

తఖ్వాపరులకు, సజ్జన సుభక్తులకు సాధకులకు ఈ ఏకాంతం ఎంతో ముఖ్యమైంది. లౌకిక ప్రపంచపు వాసనలకు దూరంగా అంతర్ముఖులై వీరు తమ లోపలికి తాము చూడగలిగే యత్నం చేస్తారు. అప్పుడా స్థితిలో వారికి నిశ్చలత్వం. ఏకాగ్రచిత్తం, స్థితప్రజ్ఞత వస్తాయి. జీవితపు లోతుల్లోకి వెళ్లి దాని తత్వాన్ని, సత్యాలను చూసే, ప్రేమ భావనను తెలుసుకునే దృష్టి ఏర్పడుతుంది. ఈ ఏకాంతం జీవిత అర్ధ, పరమార్ధాలను తెలుసుకునే అవకాశాన్నిస్తుంది. సత్య సాధనకు, సత్యశోధనకు ఇది సుగమమైన మార్గం.

## ఏకాంతం : అదో అద్భుతం

అశాంతితో నలిగిపోయేది ఒంటరితనం. ప్రశాంతతతో వెలిగేది ఏకాంతం. నిస్సత్తువతో నీరుకార్చేది ఒంటరితనం. నిశ్శబ్దంలో నిమగ్నం చేసేది ఏకాంతం. నా చెంతలేరనే దిగులుతనం ఒంటరితనం. ఏ చింతాలేని హాయితనం ఏకాంతం. సంతోషాన్ని వెతుక్కునేది ఒంటరితనం. ఆనందాన్ని అనుభవించేది ఏకాంతం. మరుపు కోసం మత్తుని కోరుకొనేది ఒంటరితనం. మౌనంతో మైమరచిపోయేది ఏకాంతం. నిన్నటిని తలుచుకుంటూ రేపటి కోసం ఎదురు చూసేది ఒంటరితనం. ప్రస్తుతంలో పరవశిస్తూ పరిమళించేది ఏకాంతం. భరించలేనిది ఒంటరితనం, ఆస్వాదించేది ఏకాంతం. పరధ్యానంలో మునిగిపోయేది ఒంటరితనం. ధ్యానంలో ఓలలాడేది ఏకాంతం. ఆత్మహత్యకి సైతం పురిగొల్పేది ఒంటరితనం. అంతరాత్మని కూడా తట్టి లేపేది ఏకాంతం. అందుకే, ఎవ్వరూ కోరుకోనిది ఒంటరితనం. అందరికీ చేతకాదు ఏకాంతం.

## రాత్రి ఏకాంత ప్రార్థన ఘనత

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు: ‘‘రాత్రిపూట తహజ్జుద్ నమాజు చెయ్యి. ఇది నీకు అదనపు నమాజు. నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నతస్థానంలో ప్రతిష్ఠింపజేయటం అసంభవం ఏమీ కాదు.’’ (బనీ ఇస్రాయీల్- 79)

‘‘వారి (విశ్వాసుల) వీపులు పడకలకు ఎడంగా ఉంటాయి.’’ (అస్ సజ్‌దహ్:16)

‘‘(విశ్వాసులు ప్రపంచంలో) రాత్రివేళల్లో చాలా తక్కువ నిదురపోయేవారుగా ఉంటారు.’’ (అజ్ జారియాత్-17)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ‘‘ప్రజలారా! సలాంను వ్యాపింపజేయండి. (ప్రజలకు) అన్నం తినిపించండి. ప్రజలు రాత్రి గాఢనిద్రలో ఉండే సమయంలో నమాజు చేయండి. అలాచేస్తే మీరు ప్రశాంతంగా స్వర్గంలోకి ప్రవేశించగలరు”. (తిర్మిజీ, హసన్, సహీహ్)

అల్లాహ్‌ను ప్రార్థించే వేళ ఈ ఏకాంతం దాసునికి ఏకాగ్రతను, మనసుకు స్థిమితాన్ని ఇస్తుంది. మనో నైర్మల్యాన్నిస్తుంది. సర్వోపగతుడైన ఆయనను మనోసీమలలో దర్శించేందుకు ఏకాంతం అద్భుత సాధనం, అంతర్ముఖచిత్తులమై అల్లాహ్ సుమనోహర నామాల, గుణాల చింతనకు, సృష్టిలోని అణువణువున ఆయన. నైపుణ్యాన్ని కాంచటానికి ఏకాంతం ఎంతగానో తోడ్పడుతుంది. మౌనస్థితిలో లౌకికానందాలను వీడుతూ, ఆ విశ్వరూప భావనను అవగతం చేసుకుంటాం. ఆసలైన ప్రేమ అనుభవైకవేద్యమవుతుంది. అది గొప్ప ఆనంద స్థితి.

ఏకాంతమంటే ప్రకృతిలో విహారం, మెచ్చిన మంచి గ్రంథ పారాయణం, నచ్చిన సద్గ్రంథ శ్రవణం, పుస్తక పఠనం, ధ్యానం-జిక్ర్... ఖుర్‌ఆన్ కంఠస్థం... ఎన్నెన్నో భావనలు. అది ఒంటరితనమే కానక్కరలేదు. సామూహికం కావచ్చు. జీవితపు ఉరుకులు, పరుగులలో తన కుటుంబసభ్యులతో, ఆత్మీయులతో, సంభాషించే సమయమే చిక్కదు. అప్పుడు వారితో మాత్రమే గడపటం కూడా ఏకాంతమే. ఏకాంతం కలత చెందిన మనసులను తేటపరుస్తుంది.

## ఏకాంతాన్ని కోరుకున్న కొండ గుహ వాసులు- కహఫ్

ఏకాంతం అన్నా ఒంటరిగా అన్నా ఒక్కరుగా ఉండటం అని అర్థము వస్తుంది. ఏకాంతం అనేదానిలో ఒక్కరు అని చెప్పడానికి లేదు.. వారు ఇద్దరు ముగ్గురుగా కూడా ఉండవచ్చు!! అంటే ఒక లక్ష్యం కోసం, ఒక పథకం కోసం, ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం, జన సమూహం నుంచి ఈ ప్రవాహ వేగం యొక్క సుడుల, జడుల నుంచి పక్కకు జరిగి వారికి వారుగా అనుకున్న లక్ష్యం, కోసం విడిగా ఉండడాన్ని ఏకాంతం అంటారు.

వారు ఏడుగురు మిత్రులు. వారందరి ఆలోచనా విధానం ఒక్కటే. వారి ప్రకారం విగ్రహారాధన, బహు దైవ భావన తప్పు. అల్లాహ్ వారికి సత్యాన్ని గ్రహించే వివేకం ప్రసాదించాడు. వారు తాము నమ్మిన ధార్మిక విశ్వాసాన్ని తమ హృదయాల్లోనే దాచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎందుకంటే తమ రాజు కూడా విగ్రహారాధకుడే కాబట్టి తమ విశ్వాసం గురించి చెబితే రాజు వేధింపులకు గురిచేస్తాడు. వారిలో ఒకడు మిగిలిన వారితో, "మనం మన విశ్వాసం పట్ల ఎంత దృఢంగా ఉన్నామో రాజుకు తెలుసు కాబట్టి తప్పక మన మీద చర్య తీసుకుంటాడు. ఒకవేళ రాజు చర్య తీసుకోకపోతే ప్రజలు రాజును బలహీనుడిగా భావించి పరిహసిస్తారు. కాబట్టి మనం ఇక్కడ ఉండటం క్షేమం కాదు, పట్టణాన్ని వదలి కొండ గుహల్లో ఎక్కడైనా ఏకాంత వాసాన్ని ఏర్పరచుకుందాం! . అక్కడ మనం స్వేచ్ఛగా మన విశ్వాసం ప్రకారం జీవించవచ్చు. ఎవరి జోక్యం ఉండదు" అన్నాడు. అలా వారు ఒక లక్ష్యంతో ఏకాంతాన్ని ఆశ్రయించారు.

### ఏకాంత మర్యాదలు

**1) సిగ్గు బిడియాలు శాశ్వత ఆభరణాలవ్వాలి:** మనిషి ఓ ఇంటి పెద్దకు, ఓ ఊరి పెద్దకు, ఓ జాతి పెద్దకు ఎంతగానయితే సిగ్గుపడతాడో దానికన్నా ఎక్కువగా అల్లాహ్‌కు సిగ్గు పడాలి. మనిషి తన మర్మస్థానాలను తన భార్య ముందు ఏకాంతంలో తప్ప కప్పి ఉంచాల్సిందిగా దైవప్రవక్త (స) హితవు పలికారు. మనిషి ఒంటరిగా ఉన్నప్పుడు నగ్నంగా ఉండవచ్చా? అని అడిగినప్పుడు - మనిషి అందరికన్నా ఎక్కువగా అల్లాహ్ ముందు సిగ్గు పడాలి అని సెలవిచ్చారు ప్రవక్త (స).

**2) ప్రార్థనలు ఎక్కువగా చేయాలి:** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించారు: "రాత్రిపూట ఆరాధన నిమిత్తం నిద్రలేచే పురుషుణ్ణి అల్లాహ్ కరుణించుగాక! అతను లేచి నమాజ్ చేస్తాడు. తన భార్యను కూడా (నమాజ్ కోసం) మేల్కొలుపుతాడు. ఒకవేళ ఆమె లేవకపోతే ముఖం మీద నీళ్ళుచల్లి లేపటానికి ప్రయత్నిస్తాడు. అలాగే రాత్రిపూట ఆరాధన నిమిత్తం నిద్రలేచే స్త్రీని అల్లాహ్ కరుణించుగాక! ఆమె లేచి నమాజ్ చేస్తుంది. తన భర్తను కూడా (నమాజ్ కోసం) నిద్ర లేపుతుంది. ఒకవేళ అతను లేవకపోతే ముఖం మీద నీళ్లు చల్లి మరీ లేపటానికి ప్రయత్నిస్తుంది.

(అబూదావూద్, దీని ఆధారాలు దృఢమైనవి)

> **నా చెంతలేరనే దిగులుతనం ఒంటరితనం. ఏ చింతాలేని హాయితనం ఏకాంతం. సంతోషాన్ని వెతుక్కునేది ఒంటరితనం. ఆనందాన్ని అనుభవించేది ఏకాంతం. మరుపు కోసం మత్తుని కోరుకొనేది ఒంటరితనం. మౌనంతో మైమరచిపోయేది ఏకాంతం. నిన్నటిని తలుచుకుంటూ రేపటి కోసం ఎదురు చూసేది ఒంటరితనం. ప్రస్తుతంలో పరవశిస్తూ పరిమళించేది ఏకాంతం. భరించలేనిది ఒంటరితనం, ఆస్వాదించేది ఏకాంతం.**

**3) దుఆ చేయడంలో గడపాలి :** అల్లాహ్ ప్రియతమ దాసులకు ఏకాంత ప్రార్థనలో కలిగినంత తన్మయం, తాదాత్మ్యం ఇతర ఏ ఆరాధనల్లోనూ కలుగదు. వారు ఏకాంత ఆరాధనా అమృతాన్ని తనివితీరా ఆస్వాదిస్తారు. ముహమ్మద్ బిన్ యూసుఫ్ (రహ్మ) ఇలా అన్నారు: అనుగ్రహాలు ఇబ్బడిముబ్బడిగా పొందాలనుకున్నవారు ఏకాంతంలో ఉన్నప్పుడు ఎక్కువ దుఆ చేయాలి.

ఏకాంతం అనేది మన జీవితంలో అత్యంత గాఢమైన సమయం - జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించే సమయం. మనం ఎంత సమయాన్ని విషయాలను ఆకళింపు చేసుకోవడంలో లేదా గ్రహించడంలో గడుపుతున్నామో, ఎంత సమయాన్ని వాటిని వ్యక్తీకరించడంలో గడుపుతున్నామో పరిశీలించుకోవాలి. ఒకవేళ మూడింట రెండు వంతుల సమయం ఆకళింపు చేసుకోవడానికి, మూడింట ఒక వంతు సమయం వ్యక్తపరచడానికి కేటాయిస్తే, ఆ వ్యక్తీకరణ లోతైనదిగా, ప్రతి ఒక్కరికీ విలువైనదిగా ఉంటుంది.

**(మిగతా వచ్చేవారం)**




# వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తాం :

## జె.ఐ.హెచ్ తెలంగాణ ఉపాధ్యక్షులు అబ్దుల్ మజీద్ షుఐబ్

పార్లమెంటులో వక్ఫ్ సవరణ చట్టం–2025 ఆమోదం పొందడాన్ని తెలంగాణ జమాఅతే ఇస్లామి హింద్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షుఐబ్ తీవ్రంగా ఖండించారు. దీనిని మత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏప్రిల్ 8న జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టం వివక్షతతో కూడుకున్నదని, ఇది ముస్లింలు తమ మతపరమైన ఆస్తులను సంరక్షించడంలో స్వయంప్రతిపత్తిని హరింపజేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ప్రభుత్వ జోక్యాన్ని పెంచుతుందన్నారు. మతపరమైన మైనారిటీలకు వారి స్వంత మత సంస్థలను నిర్వహించే హక్కును కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను బలహీనపరుస్తుందన్నారు. పార్లమెంటరీ చర్చ సందర్భంగా అధికారపక్ష సభ్యులు చేసిన తప్పుడు వాదనలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అనేక రాష్ట్రాలు హిందూ, సిక్కు ఎండోమెంట్‌ల కోసం ప్రత్యేకమైన చట్టాలను కలిగి ఉన్నాయని, పర్యవేక్షక అధికారులుగా సంబంధిత మత వర్గాలకు చెందినవారు మాత్రమే ఉంటారని ఆయన గుర్తు చేశారు.

వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని నియంత్రించడానికి చట్టంలో ఎటువంటి నిర్దిష్ట చర్యలు లేవని, పైగా ముస్లిమేతర సభ్యులను చేర్చడం, ప్రభుత్వం నామినేట్ చేసిన అధికారులకు నియంత్రణను బదిలీ చేయడం సమస్యను ఈ సమస్యకు పరిష్కారం కాదని అన్నారు. వక్ఫ్ వ్యవహారాల్లో అవినీతి, దుర్వినియోగానికి అనవసరమైన రాజకీయ, అధికార జోక్యం ప్రధాన కారణమని జేఐహెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభిప్రాయపడ్డారు.

లౌకికవాదాన్ని సమర్థిస్తున్నామని చెప్పుకుంటూనే ఈ రాజ్యాంగ విరుద్ధమైన చట్టానికి మద్దతు ఇస్తున్న రాజకీయ పార్టీల పట్ల జమాత్ ఉపాధ్యక్షుడు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ఈ కపటత్వం, రాజకీయ అవకాశవాదం, మోసానికి పరాకాష్ఠగా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ విరుద్ధమైన చట్టాన్ని రద్దు చేయడానికి అవసరమైన రాజ్యాంగబద్ధమైన, ప్రజాస్వామ్య మార్గాలను అనుసరిస్తామని ఆయన నొక్కి చెప్పారు.

తమిళనాడు ప్రభుత్వం రాజకీయ జోక్యం, మత స్వేచ్ఛను తగ్గించడంపై ఆందోళనలు లేవనెత్తిన విధంగానే తెలంగాణ ప్రభుత్వం కూడా బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని జమాఅత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ కార్యదర్శులు డాక్టర్ ఉస్మాన్, ఫక్రుద్దీన్, జయీముద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# నీటి మాటలు!

అర్షియా

**ఈ భూమిపై 70 శాతం నీరే ఉంది.** అయితే ఇందులో కేవలం ఒక్క శాతం నీరు మాత్రమే మనిషి తాగడానికి అనువైనది. ఈ ఒక్కశాతం నీటిలో ఏడో భాగం వ్యవసాయానికి, పరిశ్రమలకు వినియోగించుకుంటున్నాము. 40వ భాగం తాగడానికి, పరిశుభ్రత కోసం వినియోగిస్తాము. ప్రతి మనిషి సగటున రోజుకు 150 లీటర్ల నీటిని వినియోగిస్తాడు. మనిషి జీవితంలో ఇంత ముఖ్యమైన నీరు లేకపోతే మన జీవనం ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఒక ప్రాంతంలో ఇల్లు కట్టుకోవాలన్నా, అద్దెకు తీసుకోవాలన్నా ముందుగా అక్కడ నీటి లభ్యత గురించే ఆరా తీస్తాము. నీటికి కటకట ఉంటే మన పనులన్నీ గాడి తప్పుతాయి. దిన పత్రికల్లో నీటి కరువు వార్తలు చూస్తే బాధేస్తుంది. కొన్నిచోట్ల అడుగంటిన బావుల్లో గుక్కెడు నీటిని జాగ్రత్తగా ఒడిసి పట్టుకొని బిందెల్లో నింపుకొనేవారిని చూస్తే నీటి విలువ ఏంటో మనకు అర్థం అవుతుంది. ముఖ్యంగా వేసవిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మన స్థోమతకు తగ్గట్టు బాటసారులు, పేదల దాహార్తిని తీర్చడం మన బాధ్యత.

ప్రతీ ప్రాణి మనుగడకోసం అల్లాహ్ నీటిని సృజించాడు. అందుకే దాన్ని దేవుని వర ప్రసాదంగా భావించాలి. ఈ విశ్వంలో ఏ ప్రాణీ నీరు లేకుండా బతికి బట్టగట్టలేదు. ఎక్కడ నీరు ఉంటుందో అక్కడ జీవితం, జంతు జాలం ఉంటుంది. మనలో చాలా మందికి నీటి విలువ తెలియదు కాబట్టే నీటిని ఎంతో వృథాగా ఖర్చు పెడుతుంటారు. వాళ్ల నోటి దగ్గరికే నీళ్లు అందుతుండటంతో నీటి విలువను గుర్తించలేకపోతున్నారు. కానీ ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛమైన నీరు అందక ఏటా 20 లక్షల మంది మరణిస్తున్నారు. ప్రపంచంలోని ప్రతి పది మందిలో ఇద్దరికి కూడా శుద్ధమైన మంచి నీరు అందడం లేదన్న వార్త తెలిస్తే ఒక్క నీటి బొట్టును కూడా వృథా చేయడానికి ఎవరికీ మనసొప్పదు.

ఏడాదిలో నాలుగు నెలలపాటు వర్షాలు పుష్కలంగా కురుస్తాయి. ఈ భూమి మీద ప్రాణులకు ఎంత నీరు అవసరమో అంతే ఆకాశం నుంచి కురుస్తుంది. ఆ నీళ్లు భూ గర్భంలో, నదులు, సరస్సులు, చెరువుల్లో నిల్వ చేయబడతాయి. ఆ నీటినే మనం ఏడాదంతా వాడుతున్నాం. మన అవసరాలు ఎక్కువ కావడంతో వందల అడుగులు బోర్లు వేసి మరీ భూ గర్భ జలాలను ఖాళీ చేస్తున్నాం. ఈ నీటి ఊటలను ప్రాణి కోటి కోసం అల్లాహ్ ఏర్పాటు చేశాడని ఖుర్ఆన్ లో ఉంది. పర్వతాలు, కొండ చరియల్లో ప్రవహించే జల ధారలు మన కోసం అల్లాహ్ ఏర్పాటు చేసినవే. ఇది దైవ మహిమ. అయితే ఒక్క నీటి బొట్టును కూడా సృష్టించలేని మనిషి నీటిని వ్యర్థం చేయడం ఎంతవరకు సబబు? వర్షాలు పుష్కలంగా కురవాలన్నా, భూ గర్భంలో నీళ్లు పడాలన్నా అంతా ఆ అల్లాహ్ చేతిలోనే ఉన్నది. మనిషికి నీరు జీవనాధారం కాబట్టి ఇతర గ్రహాల్లో నీటి వనరుల కోసం మానవులు అన్వేషిస్తున్నారు. "ఆకాశాలూ, భూమీ పరస్పరం కలసి ఉండేవనీ, తరువాత వాటిని మేము వేరు చేశామని, ప్రాణం ఉన్న ప్రతిదానిని మేము నీళ్లతో సృష్టించామని.. ఆయన శక్తిని (సృష్టించే మా ఈ శక్తిని) మీరు అంగీకరించరా? (21:30)" అని ఖుర్ఆన్‌లో పేర్కొన్నాడు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి...

నీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాలని ప్రవక్త (స) 1400 సంవత్సరాల క్రితమే చెప్పారు. మానవ మహోపకారి ప్రవక్త ముహమ్మద్ (సఅసం) నీటి ప్రాముఖ్యత గురించి చెబుతూ "పారే నది ఒడ్డున కూర్చున్నా చుక్క నీటిని కూడా వృథా చేయకూడదు" అని అన్నారు. ఇబ్బడి ముబ్బడిగా, అవసరమున్నా, లేకున్నా నీటి వ్యర్థం చేసే వారికి ప్రవక్త ప్రవచనం చెంప పెట్టు.

## అల్లాహ్ నామంతో నీళ్ల నాణ్యత రెట్టింపు

అల్లాహ్ శుభనామాన్ని నీళ్లపై ఊదడం వల్ల నీటి లక్షణాలలో పెను మార్పు కలుగుతుందని జపాన్ శాస్త్రవేత్త మసారూ ఇమాతు వెల్లడించారు. అల్లాహ్ నామాన్ని పఠించి ఊదిన నీళ్లపై ఆయన

పరిశోధన చేయగా ఆ నీటి నాణ్యత ఎన్నో రెట్లు పెరిగినట్లు తన పరిశోధనలో తేలిందని ఆయన చెప్పారు. ఆ నీటికి రోగాలను నయం చేసే సామర్థ్యం కూడా పెరిగిందని, ఆ నీరు ప్రభావవంతంగా పనిచేస్తుందని ఆయన చెప్పారు.

శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడంలో నీరు కీలకపాత్ర పోషిస్తుంది. శరీర బరువును తగ్గించడంలో, పెంచడంలో నీళ్లు ఔషధంలా పనిచేస్తాయి. మనిషి దేహంలో 60 శాతం నీరుంటుంది. మహిళల్లో అయితే 55 శాతం నీరు ఉంటుంది. కిడ్నీ, కాలేయం, పొట్ట, మూత్రాశయం, గుండె, మెదడు, ఊపిరితిత్తుల లాంటి ప్రధాన అవయవాల్లో నీరు ఎక్కువగా ఉంటుంది. మన ఎముకల్లోనూ 31 శాతం నీరుంటుంది. అవయవాలన్నీ సక్రమంగా పనిచేయడానికి నీరు ఎంతో అవసరం. నీటిని సరైన మోతాదులో తాగకపోతే మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మూత్రం పచ్చగా రావడం, చర్మం పొడిబారిపోవడం, నిస్సత్తువ ఆవరిస్తాయి. శరీరానికి సరిపడినంత నీటిని తీసుకోకపోవడం వల్ల భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులు దాడి చేసే ప్రమాదమూ లేకపోలేదు. మనం తాగే నీరు చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. ఎముకల్ని పటిష్టపరుస్తుంది. మూత్రం, చెమట రూపంలో మన దేహం నుంచి రోజూ 2 లీటర్ల నీళ్లు బయటకు వెళ్లిపోతాయి. సగటున మనిషి రోజుకు కనీసం 3 లీటర్ల నీటిని తాగాలని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో మాత్రం రెండింతలు అదనంగా నీటిని తాగాలి. వ్యాయామం చేసేవారు మరింత నీటిని తాగాలి. మంచి నీటిని కూర్చొని తాగాలి. ఏక కాలంలో లీటరు నీళ్లకు మించి తాగకూడదు. తాగే నీళ్లు మరీ వేడిగానూ, మరీ చల్లగానూ ఉండకుండా చూసుకోవాలి. గోరు వెచ్చని నీళ్లు మన శరీరానికి ఎంతో ఆరోగ్యకరమైనవి. గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల ఆహారం చాలా సులువుగా జీర్ణమవుతుంది.

భోజనానికి ముందు తక్కువ మోతాదులో నీరు తాగితే తినే ఆహారం సులువుగా గొంతులోనుంచి కడుపులోకి వెళుతుంది. రాత్రి పడుకునే ముందు నీటిని తాగకూడదు. అర్ధరాత్రి నిద్రలో లేచి నీటిని తాగకూడదు. ఎక్కువ మోతాదులో కేవలం పగటి పూటనే నీటిని తాగాలి. ఒక్కసారి నీరు తాగాక గంట వ్యవధి ఉండేలా చూసుకోవాలి. ఎండ వేడిమి నుంచి వచ్చిన వెంటనే నీటిని తాగకూడదు. నీటిని సరైన మోతాదులో తీసుకోకపోవడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కీళ్ల నొప్పులు, మైగ్రేన్, చర్మరోగాలు, జుట్టు రాలడం, ఉదర సమస్యలు, అజీర్తి, నిస్సత్తువ, నిద్రలేమి, కిడ్నీ సంబంధిత వ్యాధులు, గ్యాస్, యూరిక్ యాసిడ్, ఊబకాయం తదితర 40 రకాల వ్యాధులు నీటి కొరత వల్లే వస్తాయని వైద్యులు చెబుతున్నారు. తగినంత నీటిని తాగినవారు చురుగ్గా ఉంటారు.

ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగితే అనేక వ్యాధులను నివారించవచ్చు. చాలా వరకూ జీర్ణ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. జపనీయులు ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో, బ్రష్ కూడా చేయకుండా కనీసం నాలుగు గ్లాసుల నీళ్ళను తప్పనిసరిగా తీసుకుంటారు. దాని తర్వాత అర గంటపాటు వారు ఎలాంటి ఆహారం, పానీయాలు తీసుకోరు. ఈ వాటర్ థెరఫీ వారిని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. భోజనం చేసిన ప్రతిసారి గోరువెచ్చని నీరు తాగడం వల్ల అందులోని నూనె పదార్థాలు కొవ్వుగా మారవు. ఉదయం సమయంలో గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం మరింత ప్రభావవంతంగా పని చేస్తుంది.

ఉదయాన్నే పర కడుపున నీరు తాగడం వల్ల మలబద్ధకం, పైల్స్ నివారించబడతాయి. బరువు తగ్గించే డైట్‌లో నీరు ఒకటి. తగినంత నీరు తాగడం వల్ల కడుపు మంట, హార్ట్ బర్న్ సమస్యలుండవు. ఉదయాన్నే తాగే నీళ్లు చర్మ రంధ్రాలను శుభ్రపరిచి చర్మ సౌందర్యాన్ని పెంచుతాయి. వ్యాధి నిరోధకత పెరుగుతుంది. ఆస్తమా నివారించ బడుతుంది. ఉదయాన్నే తాగే నీళ్లు జాయింట్ పెయిన్స్‌ను నివారి స్తాయి. కీళ్ల నొప్పులు, వెన్ను నొప్పి తగ్గడంలో సహాయపడతాయి. ఉదయం తాగే నీళ్లు కిడ్నీలలోని మలినాలను శుభ్రపరుస్తాయి. నీళ్లు వృద్ధాప్యాన్ని నివారిస్తాయి. నీళ్లు శరీరం స్థితిస్థాపకతను పునరుద్ధరిస్తాయి.

## దాహం తీర్చడమూ పుణ్యప్రదమే..

ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఉక్కపోత నుండి రక్షణ కోసం ప్రజలు ఇంట్లో కూలర్లు, ఏసీలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చల్లని పానీయాలతో సేద తీరుతున్నారు. కొందరు పుణ్యాత్ములు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆకలి గొన్న వానికి అన్నం పెట్టడం, దప్పిక గొన్నవాని దాహం తీర్చడం పుణ్యప్రదమని ముహమ్మద్ ప్రవక్త ప్రబోధించారు. మూగ జీవాల, పశు పక్ష్యాదుల ఆకలి, దాహార్తి తీర్చడమూ పుణ్యప్రదమేనని ముహమ్మద్ ప్రవక్త చెప్పారు. ముహమ్మద్ ప్రవక్త (సఅసం) తన శిష్య గణానికి ఒక కుక్క దాహం తీర్చి స్వర్గంలోకి వెళ్లిన ఒక వ్యక్తి గురించి కూడా వివరించారు.

నోరు లేని మూగ జీవాల దాహార్తిని తీరిస్తేనే అల్లాహ్ ప్రసన్నుడై స్వర్గ లోకాన్ని ప్రసాదిస్తే ఇక మన తోటి మానవుల దాహార్తిని తీరిస్తే అల్లాహ్ ఇంకెంత ప్రసన్నుడవుతాడో అంచనా వేయవచ్చు. అందుకే ఈ వేసవిలో మూగజీవాల దాహం తీర్చి ఎన్నో పుణ్యాలను మూట గట్టుకోవచ్చు. మన మేడలపై, కిటికీలలో, బాల్కనీల్లో, వసారాల్లో తిండి గింజలు, మంచి నీళ్ల ఏర్పాటు చేద్దాం. నీళ్లను మట్టి కుండల్లో పెట్టడం మాత్రం మర్చిపోకండి. ఎందుకంటే మట్టిపాత్రల్లో నీళ్లు చల్లగా ఉంటాయి. పక్షులు తాగడానికి వీలుగా ఉంటుంది. ఒకవేళ మన పరిసరాల్లో పశువులున్నట్లయితే వాటి కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి. పేదల వాడలను గుర్తించి అక్కడ చల్లటి మంచినీటిని ఏర్పాటు చేయాలి. వలస కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, బాటసారులు, ప్రయాణికుల దాహం తీర్చాలి. స్థితిమంతులు మంచినీటి కటకట ఉన్న ప్రాంతాల్లో బోరు బావులు తవ్వించడం, ట్యాంకుల ద్వారా ఆ ప్రాంతాలకు నీటి సరఫరా చేయడం చేస్తే అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులు కావచ్చు.




## భారత్‌లో డేంజరెస్‌గా డయాబెటిస్..! ఐడీఎఫ్ నివేదిక

రాబోయే సంవత్సరాల్లో భారత్‌లో ఆందోళనకరంగా డయాబెటిస్ రోగులు పెరిగే అవకాశం ఉందని ఇండియన్ డయాబెటిస్ ఫెడరేషన్ (IDF) వారి ఇటీవలి నివేదిక తెలియజేసింది. ప్రస్తుతం భారత్‌లో 89.8 మిలియన్ల (8.94కోట్లు) మంది డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇది 2050 నాటికి భారత్‌లో డయాబెటిస్ కేసులు 73శాతం పెరిగి 156 మిలియన్లు (15.6కోట్లు) చేరుకుంటుందని నివేదిక బయటపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 20-79 సంవత్సరాల మధ్య వయసు గల 589మంది మిలియన్ల మంది మధుమేహంతో జీవిస్తున్నారని అంచనా. ప్రపంచ జనాభాలో 11.1 శాతం మంది దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య 853 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. మధుమేహంతో జీవిస్తున్న నలుగురిలో ఒకరు (158 మిలియన్లు) 65 సంవత్స రాలు వ్యక్తులే. 20-79 సంవత్సరాల వయసు గల 365 మిలియన్ల మంది గ్లూకోజ్ టాలరెన్స్‌తో జీవిస్తున్నారని అంచనా. 2024లో మధుమేహంతో బాధపడుతున్న వారంతా చికిత్స కోసం ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. ఇది ప్రపంచ ఆరోగ్య వ్యయంలో 12శాతంగా ఉన్నది. ఇదే సంవత్సరంలో డయాబెటిస్ కారణంగా 3.4 మిలియన్ల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అన్ని కారణాలతో ప్రపంచ మరణాల రేటుతో పోలిస్తే 9.3శాతంగా ఉన్నది. అప్పుడే పుట్టిన ప్రతి ఐదుగురిలో ఒకరు (23 మిలియన్లు) ఏదో ఒక రకమైన హైపర్‌గ్లైసీమియాతో బాధపడుతున్నట్లు అంచనా.

## 2023లో ప్రపంచంలోనే అత్యధిక ప్రసవ మరణాలలో భారత్‌కు రెండవస్థానం

2023లో రెండవ అత్యధిక ప్రసవ మరణాలతో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో నిలిచినట్టు యూఎన్ నివేదిక తెలిపింది. అంటే రోజుకి 52 మంది ప్రసవం సమయంలో మరణించారని తెలిపింది. 19,000 ప్రసవ మరణాలతో భారత్, కాంగోలు రెండవస్థానంలో నిలవగా నైజీరియా మొదటి స్థానంలో ఉన్నట్టు నివేదిక తెలిపింది. '2000-2003లో ప్రసూతి మరణాల స్థితి' అనే శీర్షికతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ),యునిసెఫ్, ఐరాస పాపులేషన్ ఫండ్, ప్రపంచ బ్యాంక్ (డబ్ల్యూబీ) యూఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్స్ (జనాభా విభాగం) సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి. ప్రసవం లేదా గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలతో ప్రసవ మరణాలు జరుగుతున్నాయని నివేదిక వెల్లడించింది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, ఇతర వ్యాధులను నివారించే మందులు అందుబాటులో లేకపోవడం, అసురక్షిత గర్భస్రావాల కారణంగా ప్రసూతి మరణాలు పెరుగుతున్నాయని స్పష్టం చేసింది. 2023లో మూడు వంతుల కంటే ఎక్కువగా (28.7 శాతం), సుమారు 75,000 మరణాలతో నైజీరియా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపింది. 10,000 కంటే అధిక ప్రసూతి మరణాలు నమోదైన మొదటి మూడు దేశాలు భారత్, కాంగో (19,000), పాకిస్థాన్ (11,000)లుగా ఉన్నాయి.

## వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంలో పిటిషన్లు..

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఏప్రిల్ 15న విచారించే అవకాశం ఉంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ (సవరణ చట్టం) 2025కు సంబంధించి సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసింది. వక్ఫ్ (సవరణ) చట్టం 2025 చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఉత్తర్వులు జారీ చేసే ముందు విచారణ జరపాలని ప్రభుత్వం డిమాండ్ చేసింది. రాజకీయ నాయకులు, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమాఅతె ఇస్లామీహింద్, జమియత్ ఉలామా-ఎ-హింద్ తదితర సంస్థల పిటిషన్లతో సహా వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పది కంటే ఎక్కువ పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. కొత్తగా అమలులోకి వచ్చిన చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లను దాఖలు చేసిన న్యాయవాదులు ఏప్రిల్ 15న బెంచ్ ముందు విచారణ్ఎతిస్త్రకు జాబితా చేయబడే అవకాశం ఉందని చెప్పారు. అయితే, ఇది ఇంకా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, మహ్మద్ జావేద్, ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ, ఆర్జేడీ ఎంపీలు మనోజ్ ఝా, ఫయాజ్ అహ్మద్, ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ కూడా ఈ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 7న ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్‌కు పిటిషన్లను జాబితా చేసేందుకు పరిశీలిస్తామని హామీ ఇచ్చింది.

## 14 దేశాలకు వీసాల జారీ నిలిపివేసిన సౌదీఅరేబియా

హజ్ యాత్ర సమీపిస్తున్న తరుణంలో సౌదీ అరేబియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జరగబోయే హజ్ యాత్రకు ముందుగానే 14 దేశాల పౌరులకు వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిషేధం ఉమ్రా, బిజినెస్, కుటుంబ సందర్శన తదితర వీసాలపై జూన్ మధ్యకాలం వరకు అంటే హజ్ సమయం ముగిసే వరకు అమలులో ఉండనుంది. హజ్ యాత్ర సమయంలో రద్దీని నియంత్రించేందుకు, సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ చేసేందుకు వచ్చేవారిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకున్నదని సౌదీ అధికారులు తెలిపారు. గత ఏడాది హజ్ సమయంలో తీవ్రమైన వేడి వాతావరణం, రిజిస్టర్డ్ కాని యాత్రికుల కారణంగా తొక్కిసలాట ఘటన చోటుచేసుకుంది. ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండేందుకే సౌదీ క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే వీసా నిబంధనలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## అక్రమ వలసదారులపై సౌదీ ఉక్కుపాదం

వార్షిక హజ్ యాత్ర సమీపిస్తున్న తరుణంలో అక్రమ వలసదారులపై సౌదీ అరేబియా కఠిన చర్యలు తీసుకుంటున్నది. ఈ యాత్ర జూన్ 4-9 మధ్య జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భద్రత నిబంధనల ఉల్లంఘనదారులపై సౌదీ అరేబియా కొరడా ఝుళిపించింది. మార్చి 27-ఏప్రిల్ 2 మధ్య కాలంలో 18,407 మందిని అరెస్ట్ చేసింది. చట్టవిరుద్ధంగా దేశంలో ప్రవేశించేందుకు 1,260 మంది, దేశం నుంచి వెళ్లిపోయేందుకు 67 మంది ప్రయత్నించారని తెలిపింది. అక్రమంగా ప్రవేశించేవారికి సహకరించే వ్యక్తులకు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది.

## మరో మహమ్మారి అనివార్యం... డబ్ల్యూహెచ్ఓ చీఫ్ హెచ్చరిక

ప్రపంచానికి మరో మహమ్మారి ముప్పు పొంచి ఉందని, అది అనివార్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయేసస్ ఉద్ఘాటించారు. అయితే, ఎప్పుడనేది కచ్చితంగా చెప్పలేనప్పటికీ సంసిద్ధతతో ఉండాలని పిలుపునిచ్చారు. డబ్ల్యూహెచ్ఓ పాండమిక్ అగ్రిమెంట్‌పై జెనీవాలో నిర్వహించిన 13వ పునఃప్రారంభ సమావేశాల్లో ప్రారంభోపన్యాసం చేసిన టెడ్రోస్.. కోవిడ్-19 మహమ్మారి వల్ల ప్రపంచం ఎదుర్కొన్న పర్యవసానాలను గుర్తుచేశారు. పరిస్థితులు చక్కబడే వరకు మరో మహమ్మారి ఎదురు చూడదన్న ఆయన.. అది ఎప్పుడైనా సంభవించవచ్చన్నారు. 20ఏండ్లు అంతకంటే ఎక్కువ లేదా రేపే జరగవచ్చని చెప్పారు. ఏదేమైనా అది కచ్చితంగా జరిగి తీరుతుందని, అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. "కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన విలయాన్ని అందరం చూశాం. అధికారికంగా 70లక్షల మంది చనిపోయినప్పటికీ.. వాస్తవానికి ఆ సంఖ్య 2 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నాం. ప్రాణ నష్టానికి తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి 10 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆర్థిక నష్టాన్ని కలిగించింది" అని టెడ్రోస్ పేర్కొన్నారు.

## ఇజ్రాయెల్ నియంత్రణలో 50% గాజా భూభాగం

గత నెలలో హమాస్‌పై తిరిగి యుద్ధాన్ని ప్రారంభించిన ఇజ్రాయెల్.. గాజాపై మరింత పట్టు సాధించింది. 50 శాతం గాజా ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. ఇజ్రాయెల్ సరిహద్దు వెంబడి గాజాలో ఒక పద్ధతి ప్రకారం బఫర్ జోన్‌ను విస్తరిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొన్నది. పాలస్తీనియన్లు తిరిగి వెనక్కి రాకుండా, ఒకవేళ వచ్చినా.. అక్కడ ఉండేందుకు ఎలాంటి ఆవాసం లేకుండా అంతా ధ్వంసం చేస్తున్నారని వార్తలు వెలువడ్డాయి.

## పాలస్తీనియన్లకు తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తాం : ఇండోనేషియా అధ్యక్షుడు

గాజాలో ఇజ్రాయిల్ సైన్యం, హమాస్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో బాధితులైన పాలస్తీనియన్లకు తాత్కాలిక ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం గత నెలలో ఇజ్రాయిల్ గాజాపై తిరిగి దాడులను ప్రారంభించినప్పటి నుండి దాదాపు 4,00,000 మంది గాజా నివాసితులు నిరాశ్రయులయ్యారు. గాయపడిన బాధితులకు ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రబోవో తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, టర్కీ, ఈజిప్ట్, ఖతార్, జోర్డాన్‌లకు, మధ్యప్రాచ్య పర్యటనకు బయలుదేరే ముందు ఆయన ఈ ప్రకటన చేశారు. "వారిని రవాణా చేయడానికి మేము విమానాలను పంపడానికి సిద్ధంగా ఉన్నాము. మొదటి దశలో 1,000మంది ఉండవచ్చని మేము అంచనా వేస్తున్నాము. గాయపడిన పాలస్తీనియన్లు, అనాథలైన పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని" ఆయన అన్నారు. బాధితులు కోలుకునే వరకు, వారు తిరిగి సురక్షితంగా వెళ్లేవరకు మాత్రమే ఇండోనేషియాలో ఉంటారని, దానికి సంబంధించిన వివరాలను పాలస్తీనా అధికారులతో, స్థానిక పార్టీలతో చర్చించాలని విదేశాంగ మంత్రిని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ముస్లిం దేశమైన ఇండోనేషియా, ఇజ్రాయిల్-పాలస్తీనా వివాదానికి పరిష్కరించుకోవాలని రెండు దేశాలకు నిరంతరం పిలుపునిస్తుంది.

# పండగ వచ్చింది... కాని సంతోషమే లేదు

**- ఎం.ఎ ఆరిఫ్, కొత్తగూడెం**

రహీం భాయ్: అస్సలాము అలైకుమ్ సలీమ్ భాయ్!

సలీం భాయ్: వ అలైకుముస్సలామ్

రహీం భాయ్: ఎలా ఉన్నావు సలీం భాయ్..

సలీం భాయ్: అల్లాహ్ కరుణా కటాక్షాలతో బాగానే ఉన్నాను.

సలీం భాయ్: మరి నువ్వు ఎలా ఉన్నావు.

రహీం భాయ్: ఏం చెప్పను సలీం భాయ్. మరో రెండు రోజుల్లో రమజాన్ పండుగ రాబోతోంది.

నెల రోజుల ఉపవాసాల ఫలితంగా పండగ వస్తుంది అని సంతోష పడాలో, పిల్లలు పండగకు రావడం లేదని బాధ పడాలో అర్థం కావడం లేదు. పండుగ అంటేనే సందడి. సందడిలోనే సంబురం ఉంది.

మరి ఆ సంబురం, ఆ సందడి, ఆ సంతోషం నాలో లేదు. ఇద్దరు అబ్బాయిలు విదేశాల్లో ఉన్నారు. పండక్కి వస్తాం అని చెప్పారు.

ఈ రమజాన్ పండుగ పిల్లలతో చాలా సందడి ఉంటుంది, ఈసారి పండుగ సంతోషంగా జరుపుకోవాలనుకున్నాను. పిల్లలు ఫోన్ చేసి లీవ్ దొరకడం లేదు అని చెప్పారు. అమ్మాయి పక్క ఊరిలోనే ఉన్నా వాళ్ళ పిల్లలకు పరీక్షలు ఉండడం వల్ల రాలేను అని చెప్పింది. అన్నాతమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఎక్కడో ఊర్లల్లో రాలేనంత దూరంలో ఉన్నారు. ఇది నేను రిటైర్ అయ్యాక వచ్చిన మొదటి రమజాన్ మాసం. అల్లాహ్ దయవల్ల నా రోజాలన్నీ పూర్తి అవుతున్నాయి. రిటైర్ అయ్యాక తెలిసింది- రమజాన్ ప్రాముఖ్యత ఏమిటో. ధార్మిక పండితులు చెప్తుంటే, నా జీవితంలో ఎన్ని రమజాన్ శుభాలు, పుణ్యాలు వదులుకున్నానో తలచుకుంటే సిగ్గేస్తుంది. ఉద్యోగంలో ఉన్నన్ని రోజులు పని తప్ప వేరే ధ్యాస ఉండేది కాదు.

నా జీవితంలో ఎన్నో రమజాన్ మాసాలు పోయాయి. రమజాన్ మాసాన్ని కూడా లెక్కచేయకుండా డ్యూటీలు చేసేవాడిని. ఎంత సిగ్గుచేటు అంటే రమజాన్ పండుగ రోజున కూడా డ్యూటీకి వెళ్ళేవాడిని. ఉద్యోగం చేసేటప్పుడు నా అన్నవాళ్ళను పట్టించుకునే వాడిని కాదు. ఇప్పుడు రిటైర్ అయ్యాక నా వాళ్ళు కావాల్సి వస్తుంది. చాలా స్వార్థపరుడిని నేను. కావాల్సినంత డబ్బు, తిన్నంత తిండి, ఇళ్ళు అన్నీ ఉన్నాయి. కానీ, సంతోషం, మనశ్శాంతి లేదు. ఏదో వెలితి. నా వాళ్ళు పండుగకి లేరని, ఇంట్లో పండగ సందడి లేదని. పిల్లలు జీవితంలో ఒక ఉన్నత స్థానంలో ఉండాలని డబ్బుకు వెనుకాడకుండా చదివినంత చదివించాను. ఆ అల్లాహ్ దయవల్ల విదేశాల్లో మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. విదేశాల్లో ఉండడం వల్లనేమో ప్రేమా ఆప్యాయతలు లేకుండా పోయాయి. వాళ్ళు కూడా నాలాగే పని-పని అని సంపాదనలో పడి ప్రేమా ఆప్యాయతలు, బంధాలు, అనుబంధాలు మరిచి ఎవరినీ పట్టించుకోవడం లేదు. వాళ్ళు అలా తయారవడానికి కారణం నేనే.

నేను అనుకున్నట్టే డబ్బు బాగా సంపాదిస్తున్నారు. కానీ, డబ్బు యావలో పడి మమ్మల్ని పలకరించడమే మానేసారు. పిల్లలకు ధార్మిక విద్య నేర్పించడంలో పూర్తిగా విఫలమయ్యాను. ప్రాపంచిక విద్య నేర్పించడంలోనే సగం జీవితం గడిచిపోయింది. అదే ధార్మిక విద్య కూడా నేర్పించి ఉంటే, మంచి, చెడు, ప్రేమా ఆప్యాయతలు, పలకరింపులు, అల్లాహ్ భయ భక్తులు ఉండేవి. ఇప్పుడు అనిపిస్తుంది ధార్మిక విద్య నేర్పించకుండా చాలా పెద్ద తప్పు చేసానని. డబ్బుంటే ఇహ లోకంలో గౌరవ మర్యాదలు ఉంటాయేమో కానీ, ధార్మిక శిక్షణ లేకపోతే పరలోకం నాశనం చేసుకున్నట్టే అని తెలుసుకోలేకపోయాను.

పిల్లలు బాగుండాలని పెద్ద పెద్ద చదువులు చదివించానే కానీ, ఇలా మమ్మల్ని ఒంటరిగా వదిలేస్తారని అనుకోలేదు.

చివరికి సంతోషంగా జరుపుకునే రమజాన్ పండుగకు కూడా రాలేనంత బిజీ అయ్యారు. మళ్ళీ రమజాన్ మాసం వచ్చేసరికి నేను ఉంటానో లేదో కూడా తెలియదు.

మరణం ఎప్పుడు, ఎక్కడ వస్తుందో ఆ దైవానికి తప్ప ఎవరికీ తెలియదు.

చిన్న మొక్కలకు రోజూ నీరు పోసి జాగ్రత్తగా చూసుకుంటు.. పెంచితే మంచి ఫలాలు ఇస్తాయి. అలాగే పిల్లలను కూడా.. తల్లిదండ్రులు ప్రాపంచిక విద్యతో పాటు, ధార్మిక విద్య కూడా నేర్పిస్తే వారి జీవితం ఇహ లోకంలోనూ, పరలోకంలోనూ ఉన్నత స్థానంలో ఉంటుంది.

నా పిల్లల్లో మార్పు వస్తుంది అని, ఆ దైవం ఆదేశించిన విధంగా జీవితం గడిపేలా వారి మనస్సులో అల్లాహ్ భయభక్తులు ఉండేలా చేయమని ఏకేశ్వరుడైన ఆ దైవాన్ని రోజూ ప్రార్థిస్తున్నాను అని సలీం భాయ్ నుండి సెలవు తీసుకున్నాడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**